నేటి నుంచి

కొత్త కిక్కు

- తెరుచుకోనున్న 111 మద్యం దుకాణాలు
- అందుబాటులో కోరుకున్న బ్రాండ్లు
- గదుల కోసం ఇబ్బందులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేటి నుంచి మద్యం బాబులకు కొత్త కిక్కు ఎక్కనుంది. లక్కీ డ్రాలో షాపులు దక్కించుకున్న వారు జిల్లా వ్యాప్తంగా 111 దుకాణాలను బుధవారం తెరవనున్నారు. ఈ దుకాణాల్లో మద్యం ప్రియులు కోరుకున్న ప్రముఖ బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ దుకాణాలు తెరిచి ఉంచుతారు. అయితే కొన్ని చోట్ల మద్యం దుకాణాలు దక్కించుకున్న వాళ్లకు గదులు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బేరసారాలు జరుగుతున్నాయి.

కొత్త పాలసీ.. కొత్త దుకాణాలు..

గత ప్రభుత్వంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించింది. ఈ దుకాణాల్లో గతంలో ఎన్నో సంవత్సరాలుగా అందుబాటులో ఉన్న ప్రముఖ మద్యం బ్రాండ్లను అందుబాటులో లేకుండా చేసింది. స్థానికంగా తయారు చేసిన బ్రాండ్లనే అందుబాటులో ఉంచడంతో పాటు.. ధరలు కూడా విపరీతంగా పెంచింది. గతంలో రూ.60 ఉన్న క్వార్టర్ బాటిల్‌ను రూ.250 వరకు పెంచింది. అంతేకాకుండా మద్యం అమ్మకాలు కూడా డిజిటల్ పేమెంట్లు కాకుండా నగదు పద్ధతిలో చేపట్టింది. ప్రభుత్వమే నాసిరకం మద్యం అమ్ముతోందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నూతనంగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రకటించింది. జిల్లాలో 111 మద్యం దుకాణాలకు 2160 దరఖాస్తులు రాగా లాటరీ ద్వారా మద్యం షాపులు కేటాయించింది. దీంతో బుధవారం నుంచి మద్యం దుకాణాలు తెరుచుకుంటున్నాయి. మద్యం ప్రియులకు అలవాటైన బ్రాండ్లు మళ్లీ అందుబాటులో ఉండనున్నాయి. ధరలు సైతం తగ్గించి అమ్మనున్నారు. ప్రతి షాపులోనూ డిజిటల్ పేమెంట్లు తీసుకోవాలని ఆదేశాలిచ్చింది. దీనిని ఎక్కడైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

టీడీపీ, వైసీపీ వర్గీయులకే ఎక్కువ షాపులు

ఆన్‌లైన్ పద్ధతిలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండడంతో జిల్లాలోని 111 దుకాణాలకు జిల్లా వాసులే కాకుండా పక్క రాష్ట్రాలు, పక్క జిల్లాలకు చెందిన వాళ్లు సైతం దరఖాస్తు చేశారు. లాటరీ తీయడంతో అదృష్టం ఉన్న వాళ్లే షాపులు దక్కించుకున్నారు. ఎక్కువ భాగం టీడీపీ, జనసేన కూటమి వర్గీయులు, వైసీపీ నాయకులు దక్కించుకున్నారు. కొన్నిచోట్ల తటస్థులు షాపులు దక్కించుకున్నారు.

గదులు దొరక్క ఇబ్బందులు

కొన్ని ప్రాంతాలలో గదులకు తీవ్ర డిమాండ్ ఏర్పడింది. సోమవారం లాటరీ తీసి.. మద్యం షాపులు కేటాయించి.. బుధవారానికే షాపులు తెరవాల్సి రావడంతో గదుల సమస్య పలువురిని వెంటాడుతోంది. కొన్నిచోట్ల కొందరు దరఖాస్తు చేసుకున్న సమయానికే కీలకమైన ప్రాంతాలలో గదులను తమ ఆధీనంలోకి తీసుకున్న వ్యక్తులు.. ఇప్పుడు తమకు షాపులు దక్కకపోయినా తమకు షాపులో వాటా ఇస్తేనే.. గదులు ఇస్తామని బేరసారాలకు దిగుతున్నారు. ఇంకా కొన్ని చోట్ల గతంలో ప్రభుత్వ దుకాణాలు నిర్వహించిన గదులనే తీసుకుంటున్నారు. ఇంకా కొన్ని చోట్ల దుకాణాలు దక్కించుకున్న స్థానికేతర వ్యక్తులు.. స్థానికంగా రాజకీయంగా పలుకుబడి ఉన్న వాళ్లను కలుపుకుంటున్నారు. మొత్తానికి జిల్లాలో కూటమి ప్రభుత్వం తెచ్చిన నూతన మద్యం పాలసీతో.. కొత్త దుకాణాలతో.. మద్యం ప్రియులలో.. నూతనోత్సాహం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధం

- నేడు పాఠశాలలకు సెలవు
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజుల పాటు జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ, అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచనతో ఎటువంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశామని తెలిపారు. రైల్వేకోడూరు మండలంలో చెరువులు, నదులు, గతంలో వరదలు వర్షాలకు గురైన కాలనీల్లో తాజా పరిస్థితిని అంచనా వేయడానికి మంగళవారం డ్రోన్లను వినియోగించినట్లు తెలిపారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తినష్టం లేకుండా ముందస్తుగా హెచ్చరికలు జారీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ వర్షాభావ పరిస్థితులు ఎక్కువ కానున్న నేపథ్యంలో రేపు జిల్లాలో అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.



పీలేరులో గజ..గజ...

చిన్న రాజారెడ్డి (ఫైల్)





సంఘటనా స్థలంలో చిన్న రాజారెడ్డి మృతదేహం

- రైతుపై ఏనుగుల గుంపు దాడి
- అక్కడికక్కడే మృతి చెందిన రైతు
- ఇందిరమ్మ కాలనీ వద్ద ఘటన
- మామిడి తోటలో తిష్టవేసిన 15 ఏనుగులు
- చిన్న రాజారెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎమ్మెల్యే నల్లారి
- భయాందోళనలో ఇందిరమ్మ కాలనీ వాసులు
- ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు అటవీ శాఖ సిబ్బంది తంటాలు
- సదుం వైపు కదిలిన గజరాజులు



యల్లెల రెడ్డప్ప రెడ్డి తోటలో తిష్ట వేసిన ఏనుగులు

పీలేరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆవులను మేతకు తోలుకెళ్లిన రైతుపై ఏనుగుల గుంపు దాడి చేసి చంపేశాయి. పీలేరు మండలంలో మంగళవారం ఈ దారుణం జరిగింది. కాకులారంపల్లె పంచాయతీ బందార్లపల్లెకు చెందిన రైతు మోపిరెడ్డి చిన్న రాజారెడ్డి (62) ప్రతిరోజూలాగే ఉదయాన్నే తన ఆవులను మేత కోసం తన తోట వద్దకు తీసుకెళ్లాడు. అప్పటికే తోటలో ఉన్న 15 ఏనుగుల గుంపు రైతును తమ తొండాలతో నలిపి చంపేశాయి. దీంతో పీలేరు పట్టణం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. పీలేరు మండలానికి పొరుగున ఉన్న పులిచెర్ల, సదుం మండలాల్లో దాదాపు రెండేళ్లుగా ఏనుగుల సంచారం ఉంది. అవి పలమనేరు అటవీ ప్రాంతం నుంచి సోమల మీదుగా సదుం మండలంలో, అటు నుంచి పులిచెర్ల మండలంలోని అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి తొలిసారిగా అవి పులిచెర్ల మండలం నుంచి పీలేరు మండలంలోకి ప్రవేశించాయి. పంట పొలాలపై పడి తీవ్రమైన ఆస్తి, పంట నష్టం కలిగిస్తుండడంతో పులిచెర్ల ప్రాంతంలోని అటవీ సిబ్బంది రాత్రింబవళ్లు వాటిని అటవీ ప్రాంతాల వైపు మళ్లించేందుకు శ్రమిస్తున్నారు. అయితే అవి దారి తప్పి పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీ సమీపంలోని మామిడి తోటల్లోకి ప్రవేశించాయి. ఈ విషయం తెలియని రైతు రాజారెడ్డి మంగళవారం ఉదయం 8 గంటలకు ఇందిరమ్మ కాలనీ సమీపంలోని తన పంట పొలాల వద్దకు ఆవులను మేత కోసం తీసుకెళ్లాడు. ఏనుగులను చూసి బెదిరిన ఆవులు ఒక్కసారిగా పరుగెత్తాయి. ఆవులు బెదరడం గమనించిన చిన్న రాజారెడ్డి వాటి దగ్గరకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఇంతలో గుబురుగా ఉన్న చెట్లు, పొదల్లో ఉన్న ఏనుగులు అతడిని చుట్టుముట్టి చంపి పక్కనే ఉన్న పీలేరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు యల్లెల రెడ్డప్పరెడ్డి తోటలోకి వెళ్లిపోయాయి. ఈ విషయాన్ని గమనించిన చిన్న రాజారెడ్డి తోట పక్కన ఉన్న ఇతర రైతులు ఆయన కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలాన్ని చేరుకునేటప్పటికే ఆయన విగతజీవుడై పడి ఉన్నాడు. పోలీసులు, ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని చిన్న రాజారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చిన్న రాజారెడ్డికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఏనుగుల దాడిలో రైతు మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటన జరిగిన తీరును పోలీసులు, ఫారెస్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా ఆయన కుటుంబానికి రావాల్సిన పరిహారాన్ని అందించడంతో పాటు ఏనుగులను అటవీ ప్రాంతంలోకి మళ్లించాలని ఆయన కలెక్టర్ చామకూరి శ్రీధర్, డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్‌లను ఫోనులో కోరారు.

అప్రమత్తమైన ఫారెస్టు, పోలీసు అధికారులు

ఏనుగులు రైతుపై దాడి చేసి చంపేయడం, ఇందిరమ్మ కాలనీ సమీపంలోని తోటలో తిష్ట వేయడంతో ఫారెస్టు, పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడి నుంచి రైతు మృతదేహాన్ని తరలించిన పోలీసులు, ఆ ప్రాంతాన్నంతటినీ తమ అధీనంలోకి తీసుకుని కాలనీకి దారి తీసే దారులన్నంటినీ మూసివేశారు. స్థానికులను కట్టడి చేయడంతో పాటు ఫారెస్టు అధికారులతో సమన్వయం చేసుకుని ఏనుగులను సురక్షితంగా అటవీ ప్రాంతంలోకి మళ్లించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. వర్షం కురుస్తుండడం, ఏనుగులు తోటలో నుంచి బయటకు రాకపోవడంతో, చిత్తూరు, పలమనేరు ప్రాంతం నుంచి ట్రాకర్స్ రావడం ఆలస్యం కావడంతో ఏనుగుల మళ్లింపు కోసం మంగళవారం రాత్రి వరకు వేచి చూడాల్సి వచ్చింది.

రూ.10 లక్షల పరిహారం అందజేస్తాం

- మదనపల్లె సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు

ఏనుగుల దాడిలో మరణించిన చిన్న రాజారెడ్డి కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.10 లక్షల పరిహారం అందజేస్తామని మదనపల్లె సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు ప్రకటించారు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలోని చిన్న రాజారెడ్డి మృతదేహాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుగుల దాడిలో రైతు మరణించడం దురదృష్టకరమన్నారు. ఇప్పటి వరకు పలమనేరు, సోమల, సదుం, పులిచెర్ల మండలాలకు పరిమితమైన ఏనుగుల సంచారం పీలేరు మండలంలోనూ కనిపించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. అయితే పీలేరులో కనిపించిన గుంపులో గున్న ఏనుగులు కూడా ఉన్నట్లు తమకు ప్రాథమిక సమాచారం ఉందని, పిల్లలను కాపాడుకునే క్రమంలో అవి ఒక్కోసారి మనుషుల మీద దాడి చేస్తుంటాయని, చిన్నరాజారెడ్డి ఉదంతం కూడా అలాంటిదేనన్న అనుమానం ఉందన్నారు. ఏనుగుల సంచారం, వాటి కట్టడి గురించి పీలేరు ప్రాంతంలోని అటవీశాఖ సిబ్బందికి తగిన అనుభవం లేదని సదుం, పులిచెర్ల, చిత్తూరు, పలమనేరు ప్రాంతాల్లోని సిబ్బంది, ట్రాకర్ల సాయంతో వాటిని అటవీ ప్రాంతంలోకి మళ్లిస్తామన్నారు.

సదుం వైపు కదిలిన గజరాజులు

మామిడి తోటలో తిష్ట వేసిన ఏనుగులు ఎట్టకేలకు మంగళవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో అక్కడి నుంచి కదిలాయి. అటవీ శాఖ సిబ్బంది సాయంత్రం 6 గంటల నుంచి టపాకాయలు కాల్చారు. దీంతో అవి నెమ్మదిగా తోటలో నుంచి బయటకు అడుగులు వేశాయి. వాటిని సురక్షితంగా అటవీ ప్రాంతం వైపు మళ్లించేందుకు అటవీ శాఖ సిబ్బంది వాటి గుంపుకు ఇరువైపులా పెద్దఎత్తున బాణాసంచా కాల్చుతూ అవి వెళ్లాల్సిన వైపు కాల్చకపోవడంతో అవి సదుం ప్రాంతం వైపు కదిలాయి. పీలేరు మండలంలోని చిన్న గాండ్లపల్లె, నూనేవాండ్లపల్లె, ఆ తరువాత సదుం మండలంలోని తాటిగుంటపాళెం మీదుగా సదుం మండలంలోని బూరగమంద, చీకలచేను ప్రాంతంలోని దట్టమైన అడవులవైపు వాటిని మళ్లించారు. వాటి కదలికలను గమనిస్తూ, వాటి గమనం తప్పకుండా ట్రాకర్స్ వాటిని వెంబడించారు. కార్యక్రమాన్ని అటవీ శాఖ తిరుపతి సీసీఎఫ్ శరవణన్, చిత్తూరు జిల్లా డీఎఫ్‌వో భరణి, అన్నమయ్య జిల్లా డీఎఫ్‌వో జగన్నాథ్ సింగ్, మదనపల్లె సబ్-డీఎఫ్‌వో శ్రీనివాసులు పర్యవేక్షించారు. పీలేరు, మదనపల్లె బీట్‌లలోని సిబ్బంది వేణుగోపాల్, సబిహా సుల్తానా, రెడ్డి ఆశియాబీ, చంద్రకళ, జగదీశ్, శ్రీనివాసన్, గిరి, సుధాకర్, షాజహాన్, శోభారాణి, రామ్మోహన్, దీప, జ్యోతి విజయవంతంగా పూర్తి చేశారు. 15 ఏనుగుల గుంపులో నాలుగు గున్న ఏనుగులు ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఏనుగుల గుంపు పులిచెర్ల మండలం నుంచి వచ్చినట్లు ఫారెస్టు అధికారులు ప్రాథమిక నిర్ధారణ చేశారు. పులిచెర్ల మండలంలోని రామిరెడ్డిగారిపల్లె మీదుగా ప్రయాణించిన ఆ గుంపు పీలేరు-చిత్తూరు మార్గంలోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద జాతీయ రహదారి దాటి ఇందిరమ్మ కాలనీవైపు వచ్చి ఉంటాయని అంచనా వేస్తున్నారు.

సోలార్ ఫెన్సింగ్ పూర్తికి కృషి చేస్తాం

- మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత



చిన్న రాజారెడ్డి సతీమణి సరస్వతమ్మకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, డీఎఫ్‌వో

ఏనుగుల బెడదను నివారించేందుకు అసంపూర్తిగా మిగిలిపోయిన సోలార్ ఫెన్సింగ్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి తెలిపారు. ఏనుగుల దాడిలో మరణించిన రైతు చిన్న రాజారెడ్డి కుటుంబానికి ప్రభుత్వం తరపున అందిన రూ.5 లక్షల పరిహారం చెక్కును మంగళవారం సాయంత్రం ఆయన అన్నమయ్య డీఎఫ్‌వో జగన్నాథ్ సింగ్‌తో కలిసి చిన్న రాజారెడ్డి సతీమణి సరస్వతమ్మకు అందజేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాల విభజన కారణంగా తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా సోలార్ ఫెన్సింగ్ ప్రాజెక్టు అర్థాంతరంగా ఆగిపోయినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాను ప్రాతిపదికగా తీసుకుని జిల్లాలోని ఎమ్మెల్యేలందరినీ కలుపుకుని త్వరలో జరగబోయే టీడీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతామన్నారు. ఏనుగుల దాడిలో మరణించిన చిన్న రాజారెడ్డి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల పరిహారం మంజూరైందని, తొలి విడతగా రూ.5 లక్షల చెక్కును అందజేశామని, త్వరలోనే మిగిలిన రూ.5 లక్షలను ఆమె ఖాతాలో జమ చేస్తామన్నారు. ఏనుగులు తిష్ట వేయడం వల్ల మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు యల్లెల రెడ్డప్ప రెడ్డి మామిడి తోటకు అపార నష్టం వాటిల్లిందని, ఆయనకు పరిహారం లభించేలా చూడాలని ఎమ్మెల్యే, డీఎఫ్‌వోకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటపల్లె బాబురెడ్డి, లడ్డూజాఫర్, రెడ్డప్పరెడ్డి, బాబురెడ్డి, పురందరామ్మూర్తి, లక్ష్మీకర, చిన్నరెడ్డప్పరెడ్డి, రహంతుల్లా, శేఖర పాల్గొన్నారు.

- ఖర్చు ఎక్కువ... ఆదాయం తక్కువ...
- పెట్టుబడులు కూడా రాక మునుగుతున్న అన్నదాతలు
- వర్షంతో దెబ్బతింటున్న పంట
- ఆందోళనలో అన్నదాతలు

వరి..వర్రీ..



నందలూరు పరీవాహక ప్రాంత పంట పొలాల్లో వర్షం వల్ల నేలపాలైన వరి పంట



వర్షానికి ధాన్యంపై కప్పిన పట్ట

రాజంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో వరి రైతులు ప్రతియేటా నష్టాల పాలవుతున్నారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో వరి వెన్నుదశలో ఉంది. తుఫాన్ ప్రభావంతో పడుతున్న వర్షాల వల్ల వరి పంట దెబ్బతింటోంది. పంట పడిపోయి వడ్లు చేతికి వచ్చే పరిస్థితులు లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. సిద్దవటం మండలంలోని పెన్నానది పరీవాహక ప్రాంతాలు, రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల్లోని చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాలు వరి పంట సాగుకే అనుకూలం. ఇక్కడ ఇతర పంటలు సాగు చేయడానికి ఏమాత్రం వీలు పడదు. అందువల్ల ఇక్కడ వరి పంట మాత్రమే సాగు చేస్తున్నారు. వరి పంట 120 రోజుల నుంచి 145 రోజుల్లోపల దిగుబడి వస్తుంది. ఒక ఎకరా సాగుకు రూ.30 వేలు ఖర్చు అవుతుంది. తెగుళ్లు సోకకుండా అన్నీ బాగా ఉంటే ఎకరాకు 80 కిలోలు పట్టే 40 బస్తాలు వరిధాన్యం దిగుబడి అవుతుంది. తెగుళ్లు సోకి పంట దెబ్బతింటే ఇక రైతు పరిస్థితి అంతే. పంట బాగా ఉంటే ఒక్కో బస్తా రేటును బట్టి 1300 నుంచి 1600 వరకు రేటు పలుకుతుంది. బాగా రేటు ఉంటే 60 వేల వరకు ఆదాయం వస్తుంది. ప్రస్తుతం 80 కిలోల బస్తా 1350 రూపాయలు పలుకుతుంది. 40 బస్తాలకు కాను సుమారు 55 వేల వరకు ఆదాయం వస్తుంది. నాలుగు నెలలు కుటుంబం అంతా కష్టపడితే ఖర్చులు పోను మిగిలేది 20 వేల రూపాయలు మాత్రమే. అయితే విధిలేని పరిస్థితుల్లో అన్నదాతలు ఈ పంటను సాగు చేస్తున్నారు. రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల పరిధిలోని తాళ్లపాక, నారాయణనెల్లూరు, ఓబలి, పెనగలూరు, టంగుటూరు, పొత్తపి, లేబాక, నందలూరు, పులపత్తూరు, బగ్గిడిపల్లె, మందపల్లె, రామచంద్రాపురం, గుండ్లూరు, నాగిరెడ్డిపల్లె, ఇసుకపల్లె, కుమ్మరపల్లె, మందరం, ఒంటిమిట్ట మండలంలోని నడింపల్లె, గన్నపేరూరు చుట్టుపక్కల గ్రామాల్లో, సిద్దవటం నది పరీవాహక ప్రాంతాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో కేవలం వరి పంటనే సాగు చేస్తారు. సాగు చేసిన వరిపంటను తమ అవసరాలకు పోను మిగతా ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. కర్ణాటక, తమిళనాడు, చుట్టుపక్కల రాష్ట్రాలకు ఈ పంటను ప్రత్యేక లారీల్లో ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం వర్షాకాలం మొదలైంది. ఇటీవల తరచూ వర్షాలు పడుతుండడంతో రైతులు భారీ ఎత్తున నష్టపోతున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా వరి పంట వెన్నుదశలో ఉంది. కొన్నిచోట్ల పంటలు పండి కోతదశకు వచ్చాయి. కోతకు వచ్చిన పంటపై వర్షాలు పడడంతో అవి ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. వర్షంతో రైతులు పంటను కోయలేక, కోసిన పంటను ఇళ్లల్లో నిల్వ ఉంచుకోలేక, పంట పొలాల్లోనే ఉంచలేక అష్టకష్టాలు పడుతున్నారు. ఏది ఏమైనా వరి పంటకు గిట్టుబాటు లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు ఉండడం, తదితర కారణాల వల్ల ప్రతి ఏడాది వరిని పండించిన అన్నదాతలు నష్టాల పాలవుతూ ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నష్టపోతున్న వరి రైతులను ఆదుకుని పంట నిల్వలకు ప్రత్యేక గోడౌన్‌లు ఏర్పాటు చేసి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తే తప్ప వరి రైతులు కోలుకునే పరిస్థితి లేదు.

వరి పంట జూదంగా మారింది



-జి.నరసింహారెడ్డి, రైతు, తప్పెటవారిపల్లె, ఒంటిమిట్ట

వరిపంట ఒక జూదంగా మారింది. ఎక్కువ మోతాదులో 10 ఎకరాలు సాగు చేసిన రైతుకు గిట్టుబాటు ధర లభించకపోయినా నష్టం ఉండదు. అదే ఎకరా, రెండు ఎకరాలు సాగు చేసిన చిన్న సన్నకారు రైతులు పండించిన పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కడం లేదు. ప్రతి సంవత్సరం చెయ్యేరు, పెన్నానది పరీవాహక ప్రాంత రైతులు నష్టపోతూనే ఉన్నాం. విధిలేని పరిస్థితుల్లో వరి పంటను సాగు చేస్తున్నాం.

వరి పంటను సాగు చేయడమే వృథా



- మేడా నాగేశ్వరరెడ్డి, గాలివారిపల్లె, రాజంపేట

వరి పంటను సాగు చేయడమే వృథాగా మారింది. ఇంటిల్లిపాది కష్టపడి 5 నెలల పాటు ఈ పంటను నమ్ముకుని ఎకరాకు 30 వేలు ఖర్చు చేస్తే పైసా ఆదాయం రావడం లేదు. ఈ పంటలకు ప్రకృతి కూడా సహకరించడం లేదు. ప్రస్తుతం పండించిన వరి పంటను అమ్ముకోవాలంటే రోజూ వర్షాలు పడుతున్నాయి. ఈ పంటను నిల్వ చేసుకునేందుకు గోడౌన్‌లు లేక.. పంట పొలాల్లో పెట్టుకోలేక.. ఎగుమతి చేసినా గిట్టుబాటు ధర లేక అన్నివిధాలుగా నష్టపోతున్నారు.



ఒంటిమిట్ట మండలం నరవకాటిపల్లె వద్ద వెన్నుదశలో ఉన్న వరి పంట




నందలూరు మండలంలో వర్షానికి తడవకుండా ధాన్యానికి కప్పిన ప్లాస్టిక్ పట్టా

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా జనార్ధన్‌రెడ్డి



రాయచోటి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. ఈయన కర్నూలు జిల్లా బనగానపల్లె నుంచి తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు ఇన్‌చార్జ్ మంత్రులను నియమించారు. ఇందులో భాగంగా రాయచోటి ఎమ్మెల్యే, రవాణా, యువజన, క్రీడాశాఖా మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని చిత్తూరు జిల్లాకు ఇన్‌చార్జ్ మంత్రిగా నియమించారు.

డీపీవోగా బాలకృష్ణారెడ్డి



రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా డీపీవోగా ఉన్న ధనలక్ష్మి నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కర్నూల్ నుంచి బదిలీపై వచ్చిన వై.బాలక్రిష్ణారెడ్డి డీపీవోగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బెస్ట్‌వర్కర్ అవార్డుఅందుకుంటున్న అక్కిశెట్టి మనోహర్

ఆర్మీలో మనోహర్‌కు బెస్ట్‌వర్కర్ అవార్డు

గోపవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపల్లె వాసి అక్కిశెట్టి మనోహర్‌కు ఇండియన్ ఆర్మీ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీర్స్ విభాగంలో లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వాపినే ద్వారా బెస్ట్‌వర్కర్ అవార్డును అందుకున్నారు.

బ్రాహ్మణపల్లెకు చెందిన అక్కిశెట్టి వెంకటసుబ్బయ్య, అమ్మణ్ణమ్మ తృతీయ పుత్రుడు అక్కిశెట్టి మనోహర్ నాలుగు దశాబ్ధాలుగా ఇండియన్ ఆర్మీలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. ఆయన విశిష్ట సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఈఎంఈలో ల్యాబ్ అటెండెంట్ ఉద్యోగం ఇచ్చి గౌరవించింది. కాగా మంగళవారం తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ నగరం భారత రక్షణ శాఖ ఎలక్ట్రానిక్స్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన సంస్థ 82వ ఆవిర్భావ దినత్సోవంలో ఉత్తమ సేవలను అందించిన పలువురికి లెఫ్టినెంట్ జనరల్ అవార్డులను ప్రకటించారు ఇందులో మనోహర్ ఒకరు. ఈఎంఈ కోర్‌డే 2024 సందర్భంగా అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న మనోహర్‌ను తెలుగు భాషా సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగపల్లి వెంకటరమణ, బంధుమిత్రులు, గ్రామస్తులు అభినందించారు.

వైసీపీ నేత జాన్‌బాబు త్వరలో టీడీపీలోకి

క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా రాజీనామా

మదనపల్లె టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు బోనాసి జాన్‌బాబు మంగళవారం రాజీనామా చేశారు. వైసీపీ క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా వున్న ఆయన వ్యక్తిగత కారణాలతో పదవి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అంతేకాకుండా రాజీనామా లేఖను ఎంపీ మిధున్‌రెడ్డికి, వైసీపీ క్రిస్టియన్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడికి పంపారు. గతంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన జాన్‌బాబు, త్వరలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు.



రాజీనామా పత్రం చూపిస్తున్న జాన్‌బాబు

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

లక్కిరెడ్డిపల్లె అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సతీష్‌కుమార్ (36) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలాఉన్నాయి. రాయచోటి మండలం శిబ్యాల వాసి సతీష్‌కుమార్ లక్కిరెడ్డిపల్లె పోలీష్‌స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 10వ తేదీన విధులు పూర్తి చేసుకుని రాత్రి ద్విచక్రవాహనంలో రాయచోటికి వెళుతుండగా రాయచోటి-వేంపల్లె జాతీయ రహదారిపై బైకు అదుపుతప్పి కింద పడడంతో తలకు గాయమైంది. తిరుపతికి తరలించి ఓ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుని కుటుంబానికి సీఐ వెంకటకొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, సిబ్బంది సంతాపం తెలిపారు. సతీష్ కుటుంబాన్ని ఆదుకుంటామని సీఐ తెలిపారు.



సతీష్‌కుమార్ (ఫైల్)

బైక్ , కారు ఢీ - రైతు మృతి

నాయనివారిపల్లెలో విషాదం

ములకలచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో రైతు తిరుమల శ్రీనివాసులు(45) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... కదిరినాధునికోట పంచాయతీ నాయనివారిపల్లె వాసి శ్రీనివాసులు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రస్తుతం ఐదెకరాల్లో బొప్పాయి, మూడెకరాల్లో కొత్తిమీర పంట సాగు చేశాడు. ఈ క్రమంలో పంటలకు కొట్టేందుకు మందులు తీసుకురావడానికి శ్రీనివాసులు సోమవారం రాత్రి ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా ముంబై - చెన్నై జాతీయ రహదారిపై కదిరినాధునికోట క్రాస్ వద్ద బైక్‌ను కారు ఢీకొంది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య భువనేశ్వరి, కుమారుడు ప్రశాంత్, కుమార్తె శిరీష ఉన్నారు. రైతు మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

మదనపల్లె టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో పలు దొంగతనాల్లో నిందితుడికి కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. మహమ్మద్ రఫీక్‌పై ఇదివరకే వన్‌టౌన్ పరిధిలో నాలుగు, టు టౌన్ పరిధిలో రెండు కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఈ ఆరు కేసులపై కింది కోర్టులో విచారణ పూర్తికాగా నిందితుడికి ఒక్కో కేసులో రూ.2వేల జరిమానా, ఏడాది జైలు శిక్ష విధించారు. నిందితుడు రెండో అదనపు జిల్లా జడ్జి కోర్టులో అప్పీలు చేసుకోగా విచారణ చేపట్టిన జడ్జి అబ్రహాం ఏడాది సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ మేరకు ఏపీపీ జయనారాయణరెడ్డి, వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా విలేకర్లకు తెలిపారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

నేటి నుంచి 24 వరకు నిరక్షరాస్యత సర్వే

జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్



మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్ గౌడ్

కడప(కలెక్టరేట్) అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): నిరక్ష్య రాస్యులైన వయోజనులందరినీ అక్ష్యరాస్యులుగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ పథకంను రూపొందించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ డీఆర్వో చాంబరులో అడల్ట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అండర్ స్టాండింగ్ అఫ్ లైఫ్ లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ ఉల్లాస్ పథకంపె నిర్వహించిన సమావేశంలో డీఆర్వో మాట్లాడుతూ దేశంలో వందశాతం అక్ష్యరాస్యతను సాధించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. 15 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయసు ఉండి చదువు ఆపేసిన లేదా చదువుకోని పెద్దలను గుర్తించి అక్ష్యరాస్యతను అందిస్తామన్నారు. వారికి ప్రాథమిక విద్య, డిజిటల్ విద్య ఆర్థిక విద్యను అందిస్తారన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో నిరక్ష్య రాస్యులను గుర్తించడానికి 4.15 లక్ష్యంగా పెట్టుకుందన్నారు, అందులో మన జిల్లాలో 23,170 మంది నిరక్ష్య రాస్యులను గుర్తించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, అంగన్వాడీ, ఆయాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేసే నైట్ వాచ్‌మన్‌లు తదితరులపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. 16 నుంచి 24 వరకు డీఆర్డీఏ క్లస్టర్ కో ఆర్డినేటర్, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో నిరక్ష్యరాస్యుల సర్వేచేపడుతున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్, గ్రామీణ వార్డు సచివాలయం సిబ్బంది, సమన్వయ సహకారంతో పని చేయాలన్నారు. ఈశిక్షణా తరగతులు పూర్తి చేసుకున్న వారికి వచ్చేఏడాది మార్చిలో అసెస్మెంట్ టెస్ట్ నిర్వహించి అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలు సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ ఎం.వి. సుబ్బారెడ్డి, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, డీఈఓ అనురాధ, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి సుబ్రమణ్యం, ఐసీడీసీ, పంచాయితీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శెట్టిగుంట రాజు.. రాణి !

● కొయ్య బొమ్మల తయారీలో మహిళలకు ఉపాధి ● లేపాక్షి ద్వారా విక్రయాలు, పెరిగిన డిమాండ్

అనాదిగా బొమ్మల కొలువుల్లో కొలువుదీరిన రాజు.. రాణి బొమ్మలకు లక్ష్మీపురం గ్రామం పుట్టినిల్లుగా మారింది. ఇక్కడి కళాకారుల చేతుల్లో ప్రాణం పోసుకున్న బొమ్మలు గతంలో ఆటబొమ్మలుగా చిన్నారులను అధికంగా ఆకట్టుకునేవి. ప్రస్తుతం దుస్తులు, పూసలు, చెమికీలు, రంగులతో సరికొత్త హంగులు దిద్దుకుని పిల్లలు, పెద్దలు సహా విదేశీయులను సైతం విశేషంగా ఆకర్షిస్తున్నాయి.



రాజురాణి బొమ్మలను తయారు చేస్తున్న కళాకారులు

రైల్వేకోడూరు,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట పంచాయతీ పరిధిలో ఉన్న లక్ష్మీగారిపల్లెలో తయారు చేస్తున్న రాజు రాణి బొమ్మలు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. వందేళ్లగా ఇక్కడ కొన్ని కుటుంబాలు బొమ్మల తయారీతో జీవనోపాధి పొందుతున్నాయి. ప్రస్తుతం గ్రామంలో 150 కుటుంబాల్లో 100 కుటుంబాలు రాజురాణి కొయ్య బొమ్మల తయా రీపైనే ఆధారపడి జీవిస్తున్నారు. పురుషులతో పాటు మహిళలు కూడా 6 ఇంచుల నుంచి 36 ఇంచుల ఎత్తు తో బొమ్మలను తయారు చేస్తారు.

ఐదేళ్ల కిందట ప్రారంభం

ఐదేళ్ల కిందట విజయవాడకు చెందిన హస్తకళ అభివృద్ధి సంస్థ వారు లక్ష్మీగారిపల్లెలో రాజురాణి బొమ్మల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో పెద్ద, పెద్ద కొయ్యలను కోసేందుకు యంత్రాలు అమర్చారు. బొమ్మల తయారీకి వీలుగా అన్ని వసతులు కల్పించారు. గతంలో బొమ్మల తయారీకి ఎర్రచందనం వినియోగించేవారు. రానురాను ఎర్రచందనం విలువ పెరిగిపోవడం, అటవీశాఖ సహకరించకపోవడంతో ప్రస్తుతం టేకు, మద్ది తదితర కొయ్యలతో బొమ్మలను తయారు చేస్తున్నారు. ఒక్కో వ్యక్తి ఆరు ఇంచుల ఎత్తు బొమ్మలు రోజుకు 5 జతలు తయారు చేయగలుగుతాడు. 15 ఇంచుల బొమ్మ అయితే ఒక జత, 10 ఇంచుల బొమ్మ అయితే 2 జతలు తయారు చేస్తారు. 6 ఇంచుల రాజురాణి బొమ్మ రూ.230, 10 ఇంచి పొడవు బొమ్మ రూ.330కి విక్రయిస్తున్నారు.

మహిళలకు శిక్షణ

హస్తకళా అభివృద్ధి సంస్థ కేంద్రంలో రెండు నెలలుగా సుమారు 15 మంది మహిళలకు రాజురాణి బొమ్మలకు దుస్తుల అలంకరణపై శిక్షణ ఇస్తున్నారు. ఇందు కోసం 30 ఏళ్ల అనుభవం కలిగిన రైల్వేకోడూరుకు శ్రీదేవిని శిక్షకురాలిగా నియమించారు. దుస్తులతో అలంకరించిన బొమ్మలను మధురై, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, తిరుపతి, తిరుమల ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. బొమ్మలను మరింతగా మార్కెట్ కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం రైల్వేకోడూరులో స్టాల్ ఏర్పాటు చేయాలని, అటవీ శాఖ వారు బొమ్మల తయారీకి అవసరమై ఎర్రచందనం కలపను అందుబాటులో ఉంచాలని కళాకారులు కోరుతున్నారు.



దుస్తుల అలంకరణపై శిక్షణ ఇస్తున్న శ్రీదేవి





దుస్తుల అలంకరణలో రాజు.. రాణి - దేవుని బొమ్మలు



పెరిగిన డిమాండ్

దుస్తుల అలంకరణతో రాజురాణి బొమ్మలకు ఆదరణ పెరిగింది. మరి న్ని స్టాల్స్ ఏర్పాటు చేస్తే విదేశాలకు కూడా ఎగుమతి చేయవచ్చు. రైల్వేకోడూరులో స్టాల్ ఏర్పాటు చేయాలి. ఎంపిక చేటజూ దుస్తులకు డిజైన్ చేసి బొమ్మలకు అలంకరిస్తున్నాం. మహిళలకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి మార్కెట్‌లోకి పంపిస్తున్నాము.

- శ్రీదేవి, శిక్షకురాలు, రైల్వేకోడూరు



స్టాలు ఏర్పాటు చేయాలి

లక్ష్మీగారిపల్లె ప్రధాన దారి వద్ద ప్రభుత్వం రాజు రాణి బొమ్మల స్టాలును ఏర్పాటు చేయాలి. దీంతో మహారాష్ట్ర, హైదరాబాద్, కర్నూలు, కడప, రాజంపేట తదితర ప్రాంతాలనుంచి తిరుమల, తిరుపతి దేవస్థానానికి వెళ్లేవారు బొమ్మలను చూసే అవకాశం కలుగుతుంది. దీంతో వ్యాపారం పెరుగుతుంది.

-వసంత, కళాకారిణి, లక్ష్మీగారిపల్లె





వివిధ రకాల బొమ్మలకు దుస్తుల అలంకరణ

బొమ్మలు దేశవిదేశాలకు వెళ్లాలి

లక్ష్మీగారిపల్లె రాజురాణి బొమ్మలు దేశవిదేశాలకు వెళ్లాలి. ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ బొమ్మలకు మంచి డిమాండ్ ఉంది. కళాకారులకు తగిన పనిముట్లు ఇచ్చినా కొయ్య కొరత వేధిస్తోంది. బొమ్మల తయారీకి ప్రభుత్వం సహకారం అందించాలి

- బత్యాల మధురిమ, కళాకారిణి, లక్ష్మీగారిపల్లె



అధికారులు అడ్డుకుంటున్నారు

బొమ్మలను అమ్మేందుకు వెళుతుంటే అధికారులు పట్టుకుంటున్నారు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. మార్కెటింగ్ కల్పిస్తామన్న నేతలు పత్తా లేకుండా పోయారు. అధికారులు ఇచ్చన గుర్తింపు కార్డులు చూపించినపుడు మాత్రం బొమ్మలు ఇచ్చేసి పొమ్మంటున్నారు.

- వెంకటసుబ్బయ్య, కళాకారుడు, లక్ష్మీగారిపల్లె



నన్నారి, పొగాకు సాగుపై రైతన్నల దృష్టి



ఓబుళాపురం వద్ద సాగులోఉన్న నన్నారి తోట

కాశినాయన, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలం విభిన్న పంటలకు నిలయమైంది. పంటమార్పిడి, నికర ఆదాయం లభించేలా గతానికి భిన్నంగా కొత్త పంటల సాగుకు రైతులు ముందుకొస్తున్నారు. ఇప్పటికే పండ్ల తోటలకు పేరుగాంచిన కాశినాయన ఇతర పంటల సాగులోనూ అంతే ప్రత్యేకతను చాటుకుంటోంది. ప్రస్తుతం తెగుళ్ళు అడవి పందుల బెడదను తట్టుకునేలా నన్నారి, పొగాకు సాగుకు రైతులు ముందుకొస్తున్నారు. సంప్రదాయ వాణిజ్య పంటలైన ఎండు మిరప, పత్తి, కంది లాంటి సాగు క్రమేపీ తగ్గుముఖం పట్టింది. ఇప్పటికే బసనపల్లె, ఓబుళాపురం, ఉప్పలూరు, వరికుంట్ల పాలగిరి తదితర ప్రాంతల్లో నన్నారి దాదాపు 30 ఎకరాలు సాగులో ఉంది. ఈపంట మొక్కలు నాటిన మూడేళ్లకు గాని నన్నారి గడ్డలు తయారుకావు. గతంలో వీటికి డిమాండ్ ఉండేది. రెడ్డికొట్టాల టీడీపీ నేత ఓ.రమణారెడ్డి 2 ఎకరాలు నన్నారి సాగుచేసి దాదాపు రూ.25 లక్షలు సంపాదించాడు. ఈ ఏడాది కొత్తగా పొగాకు సాగుపై రైతులు. దృష్టి సారించారు. జీపీఐ, ఐటీసీ లాంటి కంపెనీలు ముందుకొచ్చి క్వింటా రూ.15000 చొప్పన పొగాకు కొనుగోలు చేస్తామని రైతులతో ఒప్పందం చేసుకుని పొగనారు నాటిస్తున్నారు. ఉప్పలూరు, ఇటుకులపాడు, పాపిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లోని రేగడి పొలాల్లో పొగాకు విస్తారంగా సాగుచేస్తున్నారు. పిట్టిగుంట, ఓబుళాపురం, చెన్నారెడ్డిపల్లె తదితర గ్రామాల్లోని రోడ్డు సైడు పొలాల్లో నారుమడులు సాగుచేయించి గట్టానారు(5వేలమొక్క) రూ.3500 ప్రకారం రైతులకు అమ్మిస్తూ మండలమేకాక చుట్టుపక్కల మండలాల్లో కూడా పెద్దఎత్తున పొగనారు సాగుచేయిస్తున్నారు.



ఉప్పలూరులో నాటిన పొగనారు

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీకళాశాల విద్యార్థిని శ్రీలత ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు మదనపల్లె వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. దుబ్బిగానిపల్లె వాసులు గురుమూర్తి, ప్రమీల కుమార్తె శ్రీలత కళాశాలకు వచ్చి బాత్‌రూమ్‌లోని యాసిడ్ తాగిందన్నారు. యాసిడ్ ఘాటుకు తట్టుకోలేక విద్యార్థి కేకలు వేయడంతో కళాశాల సిబ్బంది వన్ టౌన్ పోలీసులకు సమచారం అందించారు. అపస్మారక స్థితిలో పడిఉన్న విద్యార్థినిని వెంటనే సర్వజన భోదనాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా యువతి తండ్రి గురుమూర్తి పదేళ్ల కిందట చనిపోవడంతో తల్లి ప్రమీల సంరక్షణలోనే ఉంది. తల్లి వ్యవసాయ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇంటివద్ద భోజనం చేసి కళాశాలకు వెళ్లిన బిడ్డ కళాశాలలో ఏమి జరిగిందో ఏమో తెలియదుగాని ఆత్మహత్యకు యత్నించిందని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బిడ్డను చూసి తల్లి, బంధువులు బోరున విలపించారు. కళాశాల కరస్పాండెంట్ అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది మాత్రం ఆస్పత్రి వద్దకు వచ్చారు. ఏమి జరిగిందో, ఎలా జరిగిందో అయోమయ పరిస్థితిలో తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



ఒకే బెడ్‌పై ముగ్గురు పడుకుని ఉన్న దృశ్యం

ఒక బెడ్ - ముగ్గురు రోగులు

● ఫార్మసీలో సిబ్బంది కొరత ● సమయానికి రాని డాక్టర్లు
● జిల్లా కేంద్రంలో కనిపించని వంద పడకలు ● ఇదీ వందపడకల ఆస్పత్రి తీరు

రాయచోటి(కలెక్టరేట్)అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో వంద పడకల ఆస్పత్రి ప్రారంభమై దాదాపు ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు రోగులను బెడ్లు, ఫార్మసీలో సిబ్బంది కొరత వేధిస్తోంది. పదేళ్లుగా ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న వంద పడకల ఆస్పత్రి నేటికీ పూర్తి స్థాయిలో సేవలు అందించడానికి సిద్దంగా లేదు. అరకొర సమస్యలున్నాయనే వాదన బలంగా వినపడుతోంది. ఈ ప్రాంతంలో ఏదైనా ఒక చిన్న ప్రమాదం జరిగినా వెంటనే తిరుపతికి, కడపకు రెఫర్ చేసే రోజుల నుంచి అన్నిరకాల సదుపాయాలతో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు వరకు వెళ్లినా అరకొర సౌకర్యాలతో కొట్టుమిట్టాడుతోంది. వివరాల్లోకెళితే....

రాయచోటిని జిల్లా కేంద్రం చేశాక వైసీపీ ప్రభుత్వం పలు జిల్లా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా దాదాపు రూ. 24 కోట్లతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం అయితే చేశారే కాని ఆస్పత్రులపై వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు చూడడంతో అరకొర సౌకర్యాల నడుమ ఆస్పత్రి నిర్వహణ కొనసాగుతోంది. ఈ ఆస్పత్రిలో అన్ని రకాల జబ్బులకు సంబంధించిన డాక్టర్లను పూర్తి స్థాయిలో నియమించినా కొందరు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. వంద పడకల ఆస్పత్రిలో కేవలం 60 బెడ్‌లకు మాత్రమే అధికారులు చర్యలు తీసుకున్నారు. మిగిలిన వాటిపై ఇప్పటి వరకు ఏ రకమైన చర్యలు తీసుకోక పోవడం పలు రకాల విమర్శ లకు తావిస్తోంది. ఫలితంగా రోగులు ఒకే బెడ్‌పై ముగ్గురు ఉండి చికిత్స పొందాల్సిన పరిస్థితి తయారైంది. ఫార్మసీలో కూడా కేవలం ఒకే ఫార్మసిస్ట్ ఉండి రోజూ దాదాపు 1000 మందికి మందులు ఇవ్వడానికి చాలా ఇబ్బందికరంగా ఉందని తెలిసింది. రోజూ దాదాపు 1200 మందికిపైగా ఓపీ జరుగుతున్న ఈ ఆస్పత్రిలో తాగునీటి కోసం దాదాపు రూ.15 లక్షలతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.



మందులు అందిస్తున్న ఫార్మసిస్ట్





డాక్టర్ కోసం వేచి ఉన్న రోగులు - ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ

ఆస్పత్రిలో సమస్యలు

వంద పడకల ఆస్పత్రిలో కొన్ని రకాల మందుల కొరత ఉందని తెలిసింది. ల్యాబ్‌లో సిబ్బంది కొరత ఉంది. ఫార్మసీలో ముగ్గురికి గాను ఒకరే ఉన్నారు. ఆపరేషన్‌కు కావాల్సిన కిట్లు ఇంకా కొన్ని రావాల్సి ఉంది. రోగులకు బెడ్స్ పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ లాంటి జ్వరాలకు సంబంధించిన కిట్లు అందుబాటులో లేవు. సీబీపీ బ్లడ్ టెస్ట్ చేయడానికి సరిపడా పరికరాలు అందుబాటులో లేవు. వంద పడకల ఆస్పత్రిలో వెంటిలేటర్స్ కూడా లేవు. గర్భిణులు ఆపరేషన్ కొరకు ఇంకా కొన్ని మందులు రావాల్సి ఉంది. చిన్నపిల్లలకు కూడా కొన్ని మందులు అందుబాటులో లేక బయట నుంచి తెప్పించుకుంటున్నారని తెలిసింది.

సిబ్బంది, బెడ్ల కొరత వాస్తవమే

ఈ ఆస్పత్రిలో కొంత సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. అంతేగాకుండా బెడ్స్ కూడా కొంత ఇబ్బందిగానే ఉన్నాయి. ఈ విషయంపై అధికారులకు మేము ఇదివరకే రాసి పంపిచాము. వారం, పది రోజుల్లో మరో 20 బెడ్లు ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. దాదాపు రూ.15 లక్షలతో కొత్త ఆర్ఓ ప్లాంట్‌ను వారం రోజుల్లో ప్రారంభం చేయబోతున్నాం. డయాలసిస్‌కి పూర్తి ఏర్పాటు చేశాం. త్వరలో అందుబాటులోకి తీసుకొస్తున్నాం.

ఆస్పత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్

దేవుడా... నీ భూములకు దిక్కెవరు



- అన్యాక్రాంతమవుతున్న ఆలయ భూములు
- ఎకరాలు సెంట్లుగా...ఆ సెంట్లు కూడా ఎక్కడో?
- దేవదాయశాఖ భూములను పట్టించుకోని రెవెన్యూ
- పట్టీపట్టనట్లుగా దేవదాయ, రెవెన్యూ శాఖ

పులివెందుల రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆలయాల నిర్వహణకు దాతలు ఇచ్చిన భూములకు దిక్కూమొక్కు లేకపోవడంతో అన్యాక్రాంతమవుతున్నాయి. ఆలయాల్లో నిత్యం పూజలు, దూప, దీప నైవేద్యాలు, ఉత్సవాల నిర్వహణకు కొంత మంది దాతలు భూములను దేవదాయశాఖకు అప్పగించారు. ఈ భూముల్లో ఇప్పటి వరకు పంటలు సాగుచేయడం, లేదా గుత్తకు ఇవ్వడం లాంటివి చేసి వచ్చే ఆదాయాన్ని ఆలయాలకు అప్పజెప్పేవారు. అయితే కాలక్రమంలో ఆలయాలకు దాతలు ఇచ్చిన భూములు ఎక్కడ ఉన్నాయో.. ఏమయ్యాయో తెలియని పరిస్థితి. దీంతో ప్రస్తుతం చాలా ఆలయాల్లో చందాలు వేసుకుని పూజలు, ఉత్సవాలు జరిపించాల్సిన పరిస్థితి నెలకొంది.

పులివెందుల పరిధిలో పలు పురాతన ఆలయాలు ఉన్నాయి. పులివెందుల మండల పరిధిలో రంగనాథస్వామి ఆలయం, మిట్టమల్లేశ్వరస్వామి ఆలయం, తూర్పు ఆంజనేయస్వామి ఆలయం, మల్లికార్జున ఆలయం, పంచలింగాల, నామాలగుండు, అచ్చవెల్లి గంగమ్మ తల్లి తదితర పురాతన ఆలయాలు ఉన్నాయి. ఆలయాలకు గ్రామీణ ప్రాంతాలలో ఎకరా పైబడి భూములు ఉండగా పట్టణంలో మాత్రం సెంట్లలో ఉంది. ఈ వ్యత్యాసం ఎందుకు వచ్చిందో అర్థం కాని విషయం. ఎందుకంటే గతంలో ఎకరా లెక్కన భూములు రాసిచ్చేవారనేది తెలిసిన విషయమే. అదే ప్రస్తుతం సెంట్లలో ఎందుకు ఉందంటే అది దేవదాయ, రెవెన్యూ అధికారులే సమాధానం ఇవ్వాల్సి ఉంది. దేవుడి ఆస్తులు దొరికితే దోచేస్తున్నారే తప్ప కాపాడేవారు లేరని తెలుస్తోంది. దేవుడి భూములను రక్షించకుండా నేతలకు దోచిపెట్టడంలో అత్యుత్సాహం చూపుతున్నారు.


తూర్పు ఆంజనేయస్వామి ఆలయం

పట్టణంలోనే కాక గ్రామీణ ప్రాంతంలోని ఆలయాల భూములు అన్యాక్రాంతమవుతున్నాయని స్పష్టమవుతోంది.

ఆలయాల భూములు ఎక్కడెక్కడ..


పులివెందుల పట్టణంలోని మిట్టమల్లేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి కె.వెలమలవారిపల్లె రెవెన్యూ పరిధిలో 225 సర్వే నెంబర్‌లో 6.08 ఎకరాలు, సర్వేనెంబర్ 398లో 7.85 ఎకరాలు, పులివెందుల రెవెన్యూ పరిధిలో 104లో 0.03, 146లో 0.14, 147లో 4.51, 105లో 0.14సెంట్ల భూములున్నాయి. మిట్టమల్లేశ్వరస్వామి, రంగనాథస్వామి, తూర్పు పడమర ఆంజనేయస్వామి ఆలయాలకు కలిపి పులివెందుల రెవెన్యూ పరిధిలో 231లో 2.08 ఎకరాలు భూమి ఉంది. తూర్పు ఆంజనేయ స్వామి ఆలయానికి సంబంధించి కాచివారిపల్లె రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 26లో 4.90 ఎకరాలు, 50లో 0.58ఎకరాలు, 57లో 0.59ఎకరాలు, 63లో 0.56 ఎకరాల భూమి ఉంది. పులివెందుల పరిధిలో 96లో 0.10, 97లో 1.25, 93లో 0.16సెంట్లు ఉంది. రంగనాథస్వామి ఆలయానికి సంబంధించి పులివెందుల పరిధిలో 84లో 0.09, 310లో 0.41 సెంట్ల స్థలాలు ఉన్నాయి. వీటితో పాటు దేవదాయశాఖ భూములుగా పులివెందుల పరిధిలో నమోదైన 299లో 0.85, 312లో 1.25ఎకరాలు, 514లో 0.53సెంట్ల స్థలాలు ఉన్నాయి. మిట్టమల్లేశ్వరస్వామి ఆలయ భూములు కబ్జాకు గురయ్యాయి. తూర్పు ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన కొన్ని భూములు, స్థలాలు ఇంత వరకు ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థితి. వీటితో పాటు అనేక పురాతన ఆలయాలకు సంబంధించిన భూములు ఉన్నాయి. రెవెన్యూశాఖ సహకారం లేకపోవడంతో ఈ భూములు ఎక్కడున్నాయో అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

భూములున్నా చందాలే దిక్కు

ఆలయాలకు అధికంగా భూములు ఉన్నప్పటికి ఆలయాల నిర్వహణకు చందాలే దిక్కయ్యాయని చెప్పవచ్చు. ఆలయాలకు సంబంధించిన భూములు, స్థలాల ద్వారా వచ్చే ఆదాయం లెక్కేసుకుంటే లక్షల్లో వస్తుందని దేవదాయశాఖ అధికారులు అంటున్నారు. ఈ డబ్బుతో ఆలయ అభివృద్ధి, దూపదీప నైవేద్యాలు, ఉత్సవాలకు ఎవరిపైన ఆధారపడాల్సిన అవసరం ఉండదని అభిప్రాయపడుతున్నారు. కొన్ని ప్రాంతాలలో గుర్తించి ఆ స్థలాలు, భూముల్లో ఉన్న వారికి నోటీసులు అందించిన ప్రయోజనం లేదని అంటున్నారు. పట్టణ పరిధిలోని ఇస్లాంపురం ప్రాంతంలో కొందరు నిర్మాణాలు చేపట్టి స్పందించడం లేదని వాపోతున్నారు. కనీసం సర్వే చేసిన ఆలయానికి దక్కుతాయని అంటున్నారు.

పెద్దల చేతుల్లోకి...

ఆలయాలకు సంబంధించి పట్టణ ప్రాంతంలో ఉన్న భూములు, స్థలాలను పూర్తిగా కబ్జాచేసేస్తున్నారు. ఆలయ స్థలం పక్కనే స్థలం కొనుగోలు చేసి ఆలయ స్థలాన్ని కూడా కలిపేసుకొని ఇళ్లు, దుకాణాలు నిర్మించారు. ఇందుకు రెవెన్యూ అధికారుల సహకారం కూడా ఉందనడంలో సందేహం లేదు. పులివెందుల మున్సిపాలిటీ అయినప్పటి నుంచి కొందరు ఆలయ భూములను దోచేయడమే లక్ష్యంగా పెట్టుకొని.. రెవెన్యూ శాఖ సహకారంతో స్థలాలను, భూములను కబ్జా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ స్థలాల విలువ రూ. కోట్లల్లో ఉంటుంది. కొన్ని భూములను గతంలో కొందరు వేలం పేరుతో చేజిక్కించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



పట్టించుకోని రెవెన్యూశాఖ

దేవదాయశాఖకు సంబంధించిన భూములను సర్వేచేసేందుకు రెవెన్యూ అధికారులు ఎవరు ముందుకు రావడం లేదని దేవదాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఆలయాలకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం కాకుండా, ఆలయాలకు ఆదాయం చేకూర్చాలనే ఉద్దేశ్యంతో భూములను సర్వే చేయించాలని ఎన్నో ఏళ్లుగా రెవెన్యూ అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ నజీర్ అహ్మద్‌ను వివరణ అడిగేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్‌కు స్పందించలేదు.

సమస్య ఉంటే.. పరిష్కరిస్తాం..

దేవదాయశాఖ భూములను సర్వే చేసే విషయం ఇంత వరకు తమ దృష్టికి రాలేదు. ఆలయ భూములకు సంబంధించి ఏదైన సమస్య ఉంటే నా దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తా.

-జీవీఎల్ఏ ప్రత్యూష, ఆర్డీఓ, పులివెందుల.

గండికోట అనుబంధ రిజర్వాయర్లకు నీళ్లు నిలిపివేత

కొండాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి దాని అనుబంధ రిజర్వాయర్లకు ప్రస్తుతం నీటిని నిలుపుదల చేసినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. మైలవరం జలాశయం, సీబీఆర్, పైడిపాలెం, వామికొండ, సర్వరాయసాగర్ రిజర్వాయర్లకు ప్రస్తుతం నీటిని నిలుపుదల చేశారు. ఈ రిజర్వా యర్లలో తగినంత నీటిమట్టం ఉండటంతో గండికోటప్రాజెక్టు నుంచి నీటిని నిలుపుదల చేశారు. అదేవిధంగా జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా మంగళవారం గండికోటప్రాజెక్టులోకి 1900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు డీఈ తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.2 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

దెబ్బతిన్న పంటల పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలుగారి పల్లెలో అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు, మండల వ్యవసాయాధికారి సాయిజ్యోతి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో వరి పొలాల్లో నీరు నిల్వకుండా తొలగించి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాన తాకిడికి నేలకొరిగిన కుదుళ్లను నిలబెట్టి గుంపులుగా కట్టి గింజ మొలకెత్తకుండా, రంగు మారకుండా లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి పిచికారి చేయాలన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది సురేఖ, రైతులు పాల్గొన్నారు.

రాయలసీమ యూనివర్శిటీ రిజిస్ట్రారుగా డాక్టర్ విజయకుమార్‌నాయుడు



కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వైవీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెటీరియల్ సైన్స్ అండ్ నానో సహాఆచార్యులు డాక్టర్ బోయ విజయకుమార్‌నాయుడు రాయలసీమ యూనివర్శిటీ రిజిస్ట్రారుగా నియమితులయ్యారు. ఈయన యూనివర్శిటీలో శాఖాధిపతిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష అభియాన్ సమన్వయ కర్తగా, ట్రాన్స్‌పోర్టు విభాగం సమన్వయకర్తగా వైవీయూ ప్రవేశాల సహాయసంచాలకులుగా, నాక్ కోర్ కమిటీ సభ్యులుగా పనిచేశారు. కాగా, విజయకుమార్‌నాయుడు నియామకం పట్ల వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ పద్మ, అధ్యాపకులు అభినందించారు.

ఇంటికి చేరిన నాగేంద్ర మృతదేహం



సికెదిన్నె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గలపల్లె పంచాయతీ బుగ్గలేటి గ్రామానికి చెందిన ఉప్పు నాగేంద్ర (42) మృతదేహం ఎట్టకేలకు ఇంటికి చేరింది. కనీసం చివరి చూపునకు కూడా నోచుకుంటామో లేదోనని ఎదురు చూసిన కుటుంబం సభ్యులు 45 రోజుల తర్వాత మంగళవారం మృతదేహం రావడంతో అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలిలా.. నాగేంద్ర జీవనోపాధి కోసం కువైత్‌కు వెళ్లి అక్కడ కూలి పనులు చేసుకుంటూ వచ్చిన సంపాదనతో కుటుంబాన్ని పోషించేవాడు. అయితే ఆగస్టు 30వ తేదీ నాగేంద్ర అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అతని మరణవార్త కుటుంబ సభ్యులకు తెలుపలేదు. అక్కడ పనిచేసే వారు సమాచారం ఇవ్వడంతో విషయం నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో లోకేష్ చొరవ చూపి మృతదేహాన్ని రప్పించేందుకు ప్రయత్నాలు చేశారు. దీంతో వారి కుటుంబ సభ్యులు మృతదేహం వస్తుందని ఎదురుచూశారు. అంతలోనే నాగేంద్ర అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడని.. అక్కడి చట్టాల ప్రకారం నిబంధనలు పూర్తి చేసిన తర్వాతే మృతదేహాన్ని అప్పగిస్తామని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు విషయాన్ని కమలాపురం శాసనసభ్యుడు పుత్తా చైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన వారు కలెక్టర్, ఎస్పీలకు విషయం తెలిపారు. దీంతో కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాగేంద్ర మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు విశేష కృషి చేశారు. దీంతో కువైట్ నుంచి నాగేంద్ర మృతదేహం ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు మధ్య మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు సహకరించిన మంత్రి లోకేష్‌కు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డికి, కలెక్టర్, ఎస్పీలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నట్లు, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని వారి బంధువులు కోరుతున్నారు.

వీరాంజనేయులు మృతదేహం స్వగ్రామానికి..

రాయచోటిటౌన్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ దేశమైన కువెత్‌కువెళ్లి అక్కడ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కంపా వీరాంజేయులు మృతదేహాన్ని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు చొరవతో ఇండియాకు తరలించారు. సుండుపల్లె మండలం గడ్డమీదపల్లె గ్రామ నివాసి కంపా వీరాంజనేయులు కువైత్‌లో అనుమానాస్పదంగా మృతి చెందాడని.. మృతుడి కుటుంబీకులు జిల్లా ఎస్పీని కలిసి మృతదేహాన్ని స్వదేశానికి రప్పించాలని విన్నవించుకున్నారు. తక్షణమే స్పందించిన ఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడి వీరాంజనేయులు మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించారు. మృతదేహం వెంట కువైట్‌లో ఉన్న మృతుని భార్య చెన్నకేశవులమ్మ స్వగ్రామం చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి దహన సంస్కారాలు పూర్తి చేశారు. వీరాంజనేయులు మృతదేహాన్ని ఇండియాకు రప్పించినందుకు జిల్లా ఎస్పీకి, జిల్లా పోలీసుశాఖకు ఎప్పటికి రుణపడి ఉంటామని కుటుంబ సభ్యులు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకొని కృతజ్ఞతలు తెలియజేశారు.

బలపనూరులో దళితుడిపై దాడి.. కేసు


చికిత్స పొందుతున్న భార్గవ్

సింహాద్రిపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరులో ముమ్మే భార్గవ్ అనే దళిత వ్యక్తిపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తులసీనాగప్రసాద్ తెలిపారు. భార్గవ్‌కు అదే గ్రామానికి చెందిన గజ్జల చంద్రశేఖర్‌రెడ్డిల మధ్య ఆర్థిక లావాదేవాల విషయమై సమస్య తలెత్తింది. దీంతో వారిద్దరి మధ్య గొడవకు దారితీయడంతో చంద్రశేఖ ర్‌రెడ్డి మరో నలుగురు వ్యక్తులతో కలిసి దాడి చేసి.. కులం పేరుతో దూషించినట్లు భార్గవ్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గాయపడిన వ్యక్తిని పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించినట్లు తెలిపారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ.. తప్పిన ప్రమాదం

- తరచూ ఇక్కడ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో ప్రజలు


ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ.. నుజ్జునుజ్జయిన ఆటో.. గుమికూడిన జనం

ముద్దనూరు అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే గేట్ల వద్ద మంగళవారం ఆర్టీపీపీ రోడ్డులోని ఓ ఇంటిలోకి లారీ దూసుకెళ్లి బీభత్సం సృష్టించింది. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పింది. కాగా, ఐదు నెలల క్రితం ఇదే రోడ్డులోని రైల్వే గేట్లను ఢీకొంటూ మసీదు వద్ద నున్న విజయలక్ష్మి ఇంటిలోకి సిమెంటు లోడు లారీ దూసుకెళ్లడంతో భారీ ఆస్తి నష్టం సంభవించింది. అది మరవక ముందే మరో లారీ ఇంటిలోకి దూసుకెళ్లిన ఘటన జరగడంతో ఈ ప్రాంతవాసులు భయాందోళన చెందుతున్నారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలు... జమ్మలమడుగు వైపు నుంచి నల్లకార్బన్‌లోడును తీసుకువస్తున్న లారీ అతివేగంగా రావడంతో వంకపై నున్న బ్రిడ్జిని రాసుకుంటూ ఓ ఇంటి ముందు ఉన్న ఇనుప స్టాండ్‌లను, మూడు కరెంట్ స్తంభాలను, ఆటో, కారును ఢీకొంటూ మస్తాన్ అనే వ్యక్తి ఇంటిలోకి దూసుకెళ్లింది. అయితే ఇంటి ముందు మస్తాన్ చిల్లర దుకాణం, టిఫిన్ సెంటర్ నడుపుకుంటున్నాడు. ప్రతి రోజు టిఫిన్ సెంటర్ వద్ద చాలా మంది ఉండేవారు. అంగన్ తెరవకపోవడంతో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దుకాణం ముందున్న రేకుల షెడ్డు, ఆటో నుజ్జు నుజ్జు అయ్యింది. కారు పాక్షికంగా దెబ్బతింది. ఇంట్లో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. లారీ గేట్ల వైపు వచ్చి ఉంటే భారీగా ప్రాణనష్టం జరిగి ఉండేది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. కాగా, గత నాలుగేళ్ల నుంచి ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారే లేరు. బైపాస్ రోడ్డు లేకపోవడం, నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగా భారీ వాహనాలు పట్టణంలోకి ప్రవేశించి ఇక్కడ ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ


సానిపాయి సచివాలయంలో విచారణ చేపడుతున్న డీఎల్‌పీవో


వీరబల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలీస్ బందోబస్తు నడుమ సానిపాయి పంచాయతీ నిధుల దుర్వినియోగంపై మంగళవారం డీఎల్‌పీవో మస్తాన్‌వలి విచారణ చేపట్టారు. పంచాయతీలో సర్పంచ్ పనులు చేయకుండా నిధులు స్వాహా చేశారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డీపీవోను విచారణకు ఆదేశించారు. వారి ఆదేశాను సారం విచారణకు డీఎల్‌పీవోను పంపారు. గొడవలు జరిగే అవకాశం ఉన్నందున ముందస్తుగా రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్, ప్రత్యేక బలగాలతో సానిపాయి సచివాలయం వద్ద బందో బస్తు ఏర్పాటు చేశారు. అనంతరం డీఎల్‌పీవో మస్తాన్‌వలి ఫిర్యాదు దారుడైన నేతి రమేశ్‌ను, సర్పంచ్ నేతి అంజేఏయుల సమక్షంలో అభియోగాలపై రికార్డులు తనిఖీ చేసి వారి వాంగ్మూ లాన్ని నమోదు చేసుకున్నారు. అనంతరం డీఎల్‌పీవో మస్తాన్‌వలి పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఫిర్యాదుదారుడు ఇచ్చిన మేరకు నమోదు చేసుకన్నామని, రికార్డులు, ఆన్‌లైన్‌లో ఉన్న సమాచారం మేరకు విచారించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కాగా, గ్రామంలో పనులు చేయకుండా ఒక్క రూపాయి కూడా డ్రా చేయ లేదని సానిపాయి సర్పంచి నేతి అంజనేయులు అన్నారు. కొందరు అనవసరంగా లేని పోని నిందలు వేసి బురదచల్లారన్నారు.

వర్షంతో ఆగిన కోతలు

- బొప్పాయి, అరటి రవాణాకు బ్రేక్
- భారీ వర్షంతో జలమయమైన వీధులు

రైల్వేకోడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మంగళవారం రైల్వేకోడూరు నియోజకవర్గంలో బొప్పాయి, అరటి కాయల కోతలను వ్యాపారులు నిలిపివేశారు. కోతలు ఆగిపోవడంతో రైల్వేకోడూరు పట్టణ శివారులోనే లారీలను నిలిపివేశారు. వర్షం దెబ్బకు కాయలు పనికి రాకుండా పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీలకు రెండు రోజులుగా పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు భూమి నానితే ఎక్కువగా అరటి, బొప్పాయి పంటలు నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో బొప్పాయి పంట 20 వేల హెక్టార్లలో ఉండగా, అరటి 20 వేల హెక్టార్లు సాగు లో ఉంది. ఇటీవల అరటి, బొప్పాయి ధరలు బాగా పలికాయి. అరటి కిలో రూ.70 నుంచి రూ.100 వరకు పలికింది.


కోతలు ఆగిపోయిన అరటి తోట


తోటలో మాగి దెబ్బతిన్న బొప్పాయిని చూపుతున్న రైతు

బొప్పాయి టన్ను రూ.15 వేలు పలికింది. ధరలు బాగా ఉన్న సమయంలో వర్షాలు పడడంతో ఒక్కసారిగా కోతలు ఆగిపోవడం, కాయలు తోటల్లో రెండు రోజులకే దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ రెండు పంటలకు మార్కెట్‌లో ప్రస్తుతం మంచి డిమాండు ఉంది. కాగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో రైల్వేకోడూరు పట్టణంలోని పలు వీధులు జలమయం అయ్యాయి. ఇళ్లలోకి నీరు ప్రవేశించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఏఎస్ఐ కుటుంబానికి ఆర్థిక సాయం


ఏఎస్ఐ అన్వర్ సతీమణికి చెక్కు అందజేస్తున్న అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు

కడప క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బద్వేలు రూరల్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఏఎస్ఐ ఆర్.అన్వర్ కుటుంబానికి అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు రూ.2.5 లక్షల ఆర్థికసాయం అందించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్ఐ ఆర్.అన్వర్ సతీమణి బీబీజాన్‌కు అదనపు ఎస్పీ చెక్కు అందజేశారు. పోలీసు సంక్షేమంలో భాగంగా ఏర్పాటు చేసిన పోలీసు వితరణ నిధి నుంచి ఈ సాయం అందించారు. కార్యక్రమంలో డీపీఓ ఏవో ఎస్.జ్యోతి, బిసెక్షన్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

పెనగలూరులో భారీ వర్షం

పెనగలూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) :బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మంగళవారం రాత్రి 8 గంటల నుంచి మండలవ్యాప్తంగా భారీ వర్షాలు ప్రారంభమయ్యాయి. బుధవారం తెల్లారే వరకు వర్షం ఇలాగే కొనసాగితే కుంటలు, చెరువుల్లోకి ఓ మోస్తరు నీరు చేరే అవకాశం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

వర్షంతో హర్షం

రైల్వేకోడూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా వేసవిని తలపించే వాతావరణంతో తల్లడిల్లిన రైల్వేకోడూరు వాసులు ప్రస్తుతం వర్షం కురుస్తుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. తుఫాను ప్రభావంతో సోమ, మంగళవారాల్లో వర్షం కురుస్తుండడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. రైల్వేకోడూరు చుట్టూ ఉన్న అడవులు పచ్చదనం సంతరించుకున్నాయి, నదుల్లో నీరు ప్రవహిస్తోంది. ఈ వాతావరణాన్ని ప్రజలు ఆస్వాదిస్తున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

రాజంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్‌భారత్ లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఆరేళ్లకు ఒకసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రాజంపేట అసెంబ్లీలో 15 వేల సభ్యత్వాలు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ప్రధాని నరేంద్రమోడి చేపట్టిన వికసిత్ భారత్ లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం వైపు అందరూ నిలవాలని, దేశాన్ని ప్రపంచంలో అగ్రదేశంగా నిలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరిప్రసాద్, రమణ, సూర్యచంద్ర, ప్రభావతి, శ్రీనివాసులు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధ ఉత్సవం

పెనగలూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబిలి గ్రామంలో సోమవారం రాత్రి పిరాని పీర్ గ్యార్మా షరీఫ్ గంధం మహోత్సవం నిర్వహించారు. వెయ్యి మంది పైగా భక్తులకు పిరానిపీర్ ఆస్థానంలో దర్గా అధ్యక్షుడు ఎస్.అలీబాషా, ప్రధాన కార్యదర్శుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఓబిలి మాజీ సర్పంచి ఎస్.హబీబుల్లా, దర్గా అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం చేశారు. టీడీపీ నాయకుడు అమీరుల్లా, ఎస్.గౌస్‌బాషా, తాజుద్దీన్, అన్వర్‌దీన్, బషీర్, అబ్దుల్, ఆరిఫ్, షమీవుల్లా, రషీద్ పాల్గొన్నారు.

ముగిసిన జ్యోతి ఉత్సవాలు

వీరబల్లి, అక్టోబరు15: మండలంలోని మట్లి తొగటపల్లిలో సోమ, మంగళవారాల్లో చౌడేశ్వరి జ్యోతి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. సోమవారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రికి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక పల్లకిలో అలంకరించి పురవీధుల్లో డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేల్చుతూ జ్యోతుల విన్యాసాల నడుమ ఊరేగించారు. మొక్కుబడులు ఉన్నవారు మంగళవారం ఉదయం జంతుబలులు ఇచ్చారు. మదనపల్లి, యలహంక, బెంగుళూరు నుంచి తరలిరావడంతో సందడి నెలకొంది. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేడు జెండా మెరవణి

రామాపురం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): నీలకంఠ్రావుపేట దర్గాలో బుధవారం సాయంత్రం హజరత్ సయ్యద్ మహబూబ్ సుబహానీ సాహెబ్ దస్తగిరి స్వామి జెండా ఉత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దర్గా పరిధిలో పకీరు జరబులతో జెండాల మెరవణి వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఫాతెహా తరువాత అన్నప్రసాదాల పంపిణీ చేస్తామని తెలిపారు.

ఇసుక రీచ్‌ను రద్దు చేయండి

వీరబల్లి, అక్టోబరు15: మండల పరిధిలోని మట్లి పంచాయతీలోని మాండవ్యనదిలో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయవద్దని ఆ గ్రామ సర్పంచ్ నాగార్జునాచారి మంగళవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇసుక రీచ్‌తో నదీ పరివాహక ప్రాంతాల్లోని బావులు, బోర్లు ఎండిపోతాయన్నారు. ఈ రీచ్ ఏర్పాటుతో మట్లి, ఓదివీడు, తాటిగుంటపల్లి, సంగం వాండ్లపల్లె రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఇసుక రీచ్‌ను రద్దు చేసిందన్నారు.

పల్లె పండుగతో గ్రామాలకు పూర్వ వైభవం



సంబేపల్లెలో సిమెంటు రోడ్డుకు భూమిపూజ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



పుల్లంపేట: సిమెంటు రోడ్డుకు భూమిపూజ చేస్తున్న రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్

సంబేపల్లె, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): పల్లెలకు పూర్వవైభవం తెచ్చేందుకే పల్లె పండుగ పేరుతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని నారాయణరెడ్డిపల్లెలో నీకేరోడ్డు నుంచి కేజీబీవీ జూనియర్ కాలేజ్ వరకు దేవపట్ల గ్రామంలోని నీకే రోడ్డు నుండి దేవపట్లమ్మ ఆలయం వరక్కు సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. శంకుస్థాపన చేసిన పనులన్నింటినీ సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తామన్నారు. మండల కేంద్రం లోని అంబేద్కర్‌కాలనీలో మంత్రి బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లె, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం మండలాల్లో నీటి సమస్య పరిష్కారమే ధ్యేయంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్, ఎంపీడీవో నరసింహులు, ఈ వోపీఆర్‌డీ సునీల్ కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, మాజీ సర్పంచులు శశిధర్‌రెడ్డి, గోపాల్, టీడీపీ నాయకులు కోటేశ్వర్‌రెడ్డి, మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్, నూరెకరాల రంగారెడ్డి, వేణుగోపాల్ నాయుడు, భయ్యారెడ్డి, యువగళం సిద్దారెడ్డి, ఖాదర్‌బాషా, సుబ్బరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం: చిన్నమండెం మండలం వండాడి, గొర్లముదివేడు క్రాస్ తూర్పుపల్లి రోడ్డులో అలాగే కొత్తపల్లి శ్రీరామ్‌నగర్‌కాలనీ సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు.

రైల్వేకోడూరు(రూరల్): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రూ. 29 లక్షలఅంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న సిమెంటు రోడ్ల పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానదారి నుంచి సరైన రోడ్డు సదుపాయం లేక మండలంలోని వెంకటరెడ్డిపల్లి ఆరుంధతివాడ, వీపీఆర్ కండ్రిగ వాసులు నరకయాతన పడేవారన్నారు. కూటమి అధికారం లోకి రాగానే ఈ పంచాయతీలను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని కంకణం కట్టుకున్నామని తెలిపారు. అధికారులు బాలనరసింహులు,ఉమామహేశ్వర్‌రావు, ఉమా మహేశ్వర్ రెడ్డి, టీడీపీ నాయకులు మద్దిన గిరి నాయుడు, సుబ్రహ్మణ్యం రాజు (ఎన్ఎస్ఆర్), ధనంజయరాజు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మండలంలోని పున్నాటివారిపల్లె, అరుంధతివాడ, జె.వడ్డిపల్లె, జీవీపురం, నూకనాపల్లెలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఎంపీడీవో మల్‌రెడ్డి, ఈవోపీఆర్డీ రామ్మోహన్‌రెడ్డి, ఏఈ ఆంజనేయప్రసాద్, ఏపీవోపీ ఎస్.భారతి, ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, టీడీపీ సీనియర్ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, బీజేపీ నాయకులు రాజగోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అడపాల బాలాజీ, జీవీపురం టీడీపీ నాయకులు వెంకటయ్య, జీవీ సుబ్బరాయుడు, వల్లా నారాయణ, భరత్‌రెడ్డి, నాగేంద్ర, చంద్ర, పీరయ్య అన్నెపు మహేష్, పొలసాని కిరణ్ పాల్గొన్నారు.

పుల్లంపేట: పల్లె పండుగలో భాగంగా రంగంపల్లె పంచాయతీ ఆర్.గొల్లపల్లెలో సచివాలయం, అరుంధతివాడకు వెళ్లే మార్గాల్లో సిమెంట్ రోడ్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం గ్రామస్థుల నుంచి పలు సమస్యలపై వినతిపత్రాలు అందుకున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రంగంపల్లె పంచాయతీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రమణ, టీడీపీ నాయకులు మల్లి తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్ల నిర్మాణాలతోనే పల్లె ప్రగతి

గాలివీడు: సిమెంటు రోడ్ల నిర్మాణంతోనే పల్లెలు ప్రగతి పథంలో నడుస్తాయని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఎగువగొట్టివీడు, పేరంపల్లి, గరుగుపల్లి పంచాయతీల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సిమెంటు రోడ్ల నిర్మాణంతో పాటు తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ప్రతి గ్రామంలో మంచినీటి బోర్లను వేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు కోట్లతో సిమెంటు రోడ్ల పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌నాయుడు, టీడీపీ నాయకులు గీతల ధర్మారెడ్డి, ఉదయ్‌కుమార్, నాగేశ్వర్, మల్లికార్జున, వెంకట్రమణారెడ్డి, కుమార్‌రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అబ్దుల్‌కలాం



రాజంపేట: అబ్దుల్‌కలాంకు నివాళులర్పిస్తున్న బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేష్

రాజంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం భారతదేశానికేగాక ప్రపంచ మానవాళికి ఓ స్ఫూర్తిదాయకమైన గొప్ప నాయకుడని రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ కొనియాడారు. అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా మంగళవారం రాజంపేట బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మైనార్టీమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, జిల్లా కార్యదర్శి సమ్మెట నరేంద్రరాజు, మాజీ సర్పంచ్ తోట రామయ్య, జనసేనపార్టీ నాయకులు అబ్బిగారి గోపాల్, రవి, రాజు, రమణయ్య, చిన్నా, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



రైల్వేకోడూరు డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

రైల్వేకోడూరు: రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. రమేష్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన జయంతిని ప్రపంచ విద్యార్థి దినోత్సవంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ జి. దయానందం, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. సుబ్రహ్మణ్యంరాజు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: రాజంపేట పార్లమెంట్ డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్ఎంపి డాక్టర్ షఫీనాయక్ ఆధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లెలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షఫీనాయక్ మాట్లాడుతూ యువత అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, గోవింద్ వెంకటేసు, పవన్, మలినాయుడు, మస్తాన్ ,రాధాకృష్ణ, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు

పుల్లంపేట: మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను ఉపాధ్యాయులు స్థానిక ఎమ్మార్సీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మిస్సైల్ మేన్ ఆఫ్ ఇండియాగా డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం కీర్తి గడించారన్నారు

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

రాయచోటిటౌన్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుంటిమడుగు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించడంలో భాగంగా మంగళవారం బోరు వేయగా అందులో నీళ్లు పుష్కలంగా పడ్డాయి. గ్రామంలో సమస్యను గుర్తించి, పరిష్కరించిన మంత్రి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డిలకు గ్రామ ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలుకృతజ్ఞతలు తెలియజేశారు.

వాల్మీకి జయంతి విజయవంతం చేయండి

రాయచోటిటౌన్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న జరిగే వాల్మీకి జయంతి వే డుకలను విజయవంతం చేయాలని వాల్మీకి సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గువ్వల యోగానంద్‌బాబు (బుజ్జిబాబు) మంగళవారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. పట్టణంలోని బస్టాండు రోడ్డులోని వాల్మీకి విగ్రహం వద్ద కార్యక్రమాలు ఉంటాయన్నారు. వాల్మీకి సంఘం నేతలు, కుల స్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు

డ్రోన్ కెమెరాలతో వర్షం ప్రభావం పరిశీలన



శెట్టిగుంట చెరువులోనికి చేరుతున్న నీరు

రైల్వేకోడూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వర్షం నేపథ్యంలో మండలంలోని అధికారులను కలెక్టర్ చామకూరి శ్రీధర్, అదనపు కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అప్రమత్తం చేశారు. డ్రోన్ కెమెరాలతో వరద ప్రాంతాలను, శెట్టిగుంట చెరువులోకి నీరు చేరుతున్న దృశ్యాలను పరిశీలించారు. రెడ్డివారిపల్లె బ్రిడ్జి వద్ద వరద నీరు రాకుండా చర్యలు తీసుకున్నారు. గతంలో నరసరాంపేటలో కూలిన ఇళ్లను అధికారులు పరిశీలించారు. వరద ప్రభావితం చేసే ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



కరీంబాషాను తీసుకెళ్తున్న టీడీపీ నాయకుడు

రామాపురం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామాపురం మండలం గువ్వలచెరువుకు చెందిన కరీంబాషా మంగళవారం ద్విచక్రవాహనంలో ఘాట్‌పైకి వెళ్లి తిరిగి ఇంటికి వస్తూ ఉండగా గువ్వలచెరువు మొదటి మలుపు వద్ద వాహనం అదుపు తప్పి కిందపడింది. ఈ సంఘటనలో కరీంబాషాకు కాలు విరిగింది. అదే మార్గంలో కడపకు వెళుతున్న గువ్వలచెరువుకు చెందిన టీడీపీ నాయకుడు షేక్. ఆజాంబాషా తీవ్రగాయాలతో ఉన్న కరీంబాషాను తన కారులో కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి'



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్ల అసోసియేషన్ సభ్యులు

నందలూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలాగా పనిచేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వలంటీర్లు ప్రభుత్వాన్ని కోరారు. నందలూరులోని గ్రామ,వార్డు వలంటీర్ల అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఈ మే రకు ఎంపీడీవో సుజాతమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, 10 వేల రూపాయలు గౌరవ వేతనం ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఇంకా జీతాలు కాని, ఉద్యోగ భద్రత కానీ, కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రావాల్సిన పెండింగ్‌లో ఉన్న జీతాలను 10 వేల రూపాయల గౌరవ వేతనాన్ని తక్షణమే మంజూరు చేసి వలంటీర్లను ఉద్యోగంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో సుజాత మాట్లాడుతూ వినతిపత్రాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు సాయికృష్ణ, సుబ్రమణ్యంరెడ్డి, కమల్, సుధీర్, సునీల్, సుధా, అబ్దుల్ రహమాన్, సుధారాణి, పావని, నూతన, ఉమామహేశ్వరి, మాణిక్యమ్మ, జ్యోతి, సుజిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజలెవరూ బయటికి రావద్దు!

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ సూచనల మేరకు రాబోయే రెండు రోజుల్లో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రాయచోటి డివిజన్‌లో ఉన్న అన్ని మండలాల ప్రజలు బుధవారం బయటికి రావద్దని రాయచోటి ఆర్డీవో రంగస్వామి ఒక ప్రకటనలో హెచ్చరించారు. కొన్ని మండలాల్లో అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం కూడా ఉన్నట్లు సమాచారం ఉందని తెలిపారు. కావున దయచేసి ప్రజలు ఎవరూ రేపు ఎటువంటి పరిస్థితుల్లో కూడా బయటికి రావద్దని ప్రకటించారు.

రాజంపేట, కోడూరువాసులు అప్రమత్తంగా ఉండాలి



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నిధియాదేవి

రాజంపేట టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తుఫాను తీవ్రత కారణంగా రాజంపేట, కోడూరు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి కోరారు. మంగళవారం రాజంపేట పట్టణంలోని సుద్దగుంతలు, జీఎంసీ క్లబ్, నూనెవారిపల్లెరోడ్డు ప్రాంతాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లోతట్టు ప్రాంతాల ప్రజలతో ఆమె మాట్లాడారు.అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అత్యవసరమైతే 08565-240079 నంబరు హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేస్తే తక్షణం సహాయ చర్యలు తీసుకుంటామన్నారు. కోడూరులో ఇప్పటికే భారీ వర్షం కురుస్తోందని దీని తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. కావున రాజంపేట, కోడూరు నియోజకవర్గాల ప్రజలు 2 రోజుల పాటు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తుఫా ను తీవ్రతను ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. రెవెన్యూ, పంచాయతిరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీసు, అగ్నిమాపక తదితర అన్నిశాఖల సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు.

పంట నష్టం వివరాలు నమోదు

● జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ చంద్రానాయక్



తడిసిన వరి పైరును పరిశీలిస్తున్న అధికారులు

నందలూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ చంద్రానాయక్ తెలిపారు. మండలంలోని పాటూరు, నాగిరెడ్డిపల్లె గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న వరిపైరును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొలాల్లో నిలచిన నీటిని బయటకు తరలించాలన్నారు. కోసిన వరికుప్పలపైన ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. వర్షం తగ్గిన తర్వాతే కోతలు ప్రారంభించాలని సూచించారు. సమస్యలు ఉంటే రైతుసేవా కేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బందిని కలవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మల్లికార్జున, గ్రామ వ్యవసాయ సహాయకులు షణ్ముఖ శ్రీనివాస్, పుష్పాం జలి, సాయిప్రియ, శ్రీనివాసులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి యూనిఫాం వితరణ



యూనిఫాం దుస్తులు అందజేస్తున్న బిట్స్ కాలేజ్ చైర్మన్ భాస్కర్

రామాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రామాపురం పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న 25 మంది కానిస్టేబుళ్లకు బిట్స్ కాలేజ్ చైర్మన్ మన్నేరు భాస్కర్ మంగళవారం సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటసుధాకర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మన్నేరు భాస్కర్ మాట్లాడుతూ అసాంఘిక శక్తులతో పోరాటం చేస్తున్న పోలీసులకు తన వంతుగా రామాపురం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి యూనిఫాం దుస్తులు అందజేశామన్నారు.

మట్టి రోడ్లను బాగుచేయండి: సీపీఐ



రోడ్లను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు, అక్టోబరు 15: (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామ్‌నగర్, ఒంటెల సిద్ధయ్య నగర్, వడ్డిపల్లెలో సిమెంట్ రోడ్లు వేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి డిమాండ్ చేశారు. మంగళ వారం సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు పంచాయతీలో మట్టి రోడ్లపై గుంతలు పడడంతో, వాటిలో వర్షపునీరు నిలవడంతో ఈ మార్గంలో వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. గ్రామాల్లో చెత్త కుప్పలను తొలగించకపోవడంతో ప్రజల్లో అంటువ్యాధులపై ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మొగిలి వినయ్, కోడూరు మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో కందిలో అధిక దిగుబడులు

లక్కిరెడ్డిపల్లె అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కందిలో సస్య రక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి రమేష్‌బాబురావు తెలిపారు. మంగళవారం బి యర్రగుడి, కోనంపేట గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలకు కంది పైరు ఆశాజనకంగా ఉందన్నారు. ఉద్యానశాఖ అధికారి నాగమణి మాట్లాడుతూ నవంబరు నుంచి మామిడి లో లోదుక్కులు చేసి, ఎండిన కొమ్మలను కత్తిరించి ఎరువులు వాడాలన్నారు, డిసెంబరుమొదటి వారం నుంచి పూత వచ్చే అవకాశం ఉందని, పూత వచ్చిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చున్నారు., పశుసంవర్ధకశాఖ అధికారులు అందుబాటులో ఉంటారని, ,పశువులకు రోగాలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రతలు సూచనలు తెలుసుకోవచ్చున్నారు. 75శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్న మొక్కజొన్న గడ్డి విత్తనాలు పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈఓలు అనూష, కెరోలిన్ , అధికారులు హరిత, ఓంసుధ, రైతులు పాల్గొన్నారు.

మద్యం ఆదాయం పైనే శ్రద్ధ ..!

రాయచోటిటౌన్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుకు మద్యం ఆదాయం ఉన్న సూపర్ సిక్స్ పథకాల అమలుపై లేకపోవడం దురదృష్టకరమని రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు కూటమి ప్రభుత్వంలో ఇసుక ధర రెండింతలు పెరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా వైసీపీ అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ సమష్టి కృషితో జిల్లాలో వైసీపీని బలోపేతం చేస్తామన్నారు.

గువ్వలచెరువులో డ్రైనేజీ లేక ఇక్కట్లు

రామాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మురుగు కాలువలు లేకపోవడంతో మండలంలోని గువ్వల చెరు వు వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గువ్వల చెరువులో సుమారు 500 కుటుంబాలుండగా మురుగు నీరంతా వీధుల్లోనే నిలు స్తోంది. వర్షాకాలంలో ఈ నీళ్లు ఇంట్లోకి వస్తున్నాయి. దీం తో దోమలు డెంగ్యూ మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వస్తున్నాయి. గ్రామం లో మురుగు కాలువలు ఏర్పాటు చేయకపోతే రోగాలబారిన పడే అవకా శాలు ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికా రులు చర్యలు తీసుకుని మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బెస్ట్‌వర్కర్ అవార్డుఅందుకుంటున్న అక్కిశెట్టి మనోహర్

ఆర్మీలో మనోహర్‌కు బెస్ట్‌వర్కర్ అవార్డు

గోపవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపల్లె వాసి అక్కిశెట్టి మనోహర్‌కు ఇండియన్ ఆర్మీ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీర్స్ విభాగంలో లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వాపినే ద్వారా బెస్ట్‌వర్కర్ అవార్డును అందుకున్నారు.

బ్రాహ్మణపల్లెకు చెందిన అక్కిశెట్టి వెంకటసుబ్బయ్య, అమ్మణ్ణమ్మ తృతీయ పుత్రుడు అక్కిశెట్టి మనోహర్ నాలుగు దశాబ్ధాలుగా ఇండియన్ ఆర్మీలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. ఆయన విశిష్ట సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఈఎంఈలో ల్యాబ్ అటెండెంట్ ఉద్యోగం ఇచ్చి గౌరవించింది. కాగా మంగళవారం తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ నగరం భారత రక్షణ శాఖ ఎలక్ట్రానిక్స్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన సంస్థ 82వ ఆవిర్భావ దినత్సోవంలో ఉత్తమ సేవలను అందించిన పలువురికి లెఫ్టినెంట్ జనరల్ అవార్డులను ప్రకటించారు ఇందులో మనోహర్ ఒకరు. ఈఎంఈ కోర్‌డే 2024 సందర్భంగా అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న మనోహర్‌ను తెలుగు భాషా సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగపల్లి వెంకటరమణ, బంధుమిత్రులు, గ్రామస్తులు అభినందించారు.

వైసీపీ నేత జాన్‌బాబు త్వరలో టీడీపీలోకి

క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా రాజీనామా



రాజీనామా పత్రం చూపిస్తున్న జాన్‌బాబు

మదనపల్లె టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు బోనాసి జాన్‌బాబు మంగళవారం రాజీనామా చేశారు. వైసీపీ క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా వున్న ఆయన వ్యక్తిగత కారణాలతో పదవి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అంతేకాకుండా రాజీనామా లేఖను ఎంపీ మిధున్‌రెడ్డికి, వైసీపీ క్రిస్టియన్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడికి పంపారు. గతంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన జాన్‌బాబు, త్వరలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



సతీష్‌కుమార్ (ఫైల్)

లక్కిరెడ్డిపల్లె అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సతీష్‌కుమార్ (36) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలాఉన్నాయి. రాయచోటి మండలం శిబ్యాల వాసి సతీష్‌కుమార్ లక్కిరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 10వ తేదీన విధులు పూర్తి చేసుకుని రాత్రి ద్విచక్రవాహనంలో రాయచోటికి వెళుతుండగా రాయచోటి-వేంపల్లె జాతీయ రహదారిపై బైకు అదుపుతప్పి కింద పడడంతో తలకు గాయమైంది. తిరుపతికి తరలించి ఓ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుని కుటుంబానికి సీఐ వెంకటకొండారెడ్డి, ఎస్‌ఐ రవీంద్రబాబు, సిబ్బంది సంతాపం తెలిపారు. సతీష్ కుటుంబాన్ని ఆదుకుంటామని సీఐ తెలిపారు.

బైక్ , కారు ఢీ - రైతు మృతి

నాయనివారిపల్లెలో విషాదం

ములకలచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో రైతు తిరుమల శ్రీనివాసులు(45) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... కదిరినాధునికోట పంచాయతీ నాయనివారిపల్లె వాసి శ్రీనివాసులు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రస్తుతం ఐదెకరాల్లో బొప్పాయి, మూడెకరాల్లో కొత్తిమీర పంట సాగు చేశాడు. ఈ క్రమంలో పంటలకు కొట్టేందుకు మందులు తీసుకురావడానికి శ్రీనివాసులు సోమవారం రాత్రి ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా ముంబై - చెన్నై జాతీయ రహదారిపై కదిరినాధునికోట క్రాస్ వద్ద బైక్‌ను కారు ఢీకొంది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య భువనేశ్వరి, కుమారుడు ప్రశాంత్, కుమార్తె శిరీష ఉన్నారు. రైతు మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

మదనపల్లె టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో పలు దొంగతనాల్లో నిందితుడికి కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. మహమ్మద్ రఫీక్‌పై ఇదివరకే వన్‌టౌన్ పరిధిలో నాలుగు, టు టౌన్ పరిధిలో రెండు కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఈ ఆరు కేసులపై కింది కోర్టులో విచారణ పూర్తికాగా నిందితుడికి ఒక్కో కేసులో రూ.2వేల జరిమానా, ఏడాది జైలు శిక్ష విధించారు. నిందితుడు రెండో అదనపు జిల్లా జడ్జి కోర్టులో అప్పీలు చేసుకోగా విచారణ చేపట్టిన జడ్జి అబ్రహాం ఏడాది సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ మేరకు ఏపీపీ జయ నారాయణరెడ్డి, వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా విలేకర్లకు తెలిపారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

నేటి నుంచి 24 వరకు నిరక్షరాస్యత సర్వే

జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్



మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్ గౌడ్

కడప(కలెక్టరేట్) అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): నిరక్ష్య రాస్యులైన వయోజనులందరినీ అక్ష్యరాస్యులుగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ పథకంను రూపొందించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ డీఆర్వో చాంబరులో అడల్డ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అండర్ స్టాండింగ్ అఫ్ లైన్ లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ ఉల్లాస్ పథకంపె నిర్వహించిన సమావేశంలో డీఆర్వో మాట్లాడుతూ దేశంలో వందశాతం అక్ష్యరాస్యతను సాధించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. 15 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయసు ఉండి చదువు ఆపేసిన లేదా చదువుకోని పెద్దలను గుర్తించి అక్ష్యరాస్యతను అందిస్తామన్నారు. వారికి ప్రాథమిక విద్య, డిజిటల్ విద్య, ఆర్థిక విద్యను అందిస్తారన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో నిరక్ష్య రాస్యులను గుర్తించడానికి 4.15 లక్ష్యంగా పెట్టుకుందన్నారు, అందులో మన జిల్లాలో 23,170 మంది నిరక్ష్య రాస్యులను గుర్తించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, అంగన్వాడీ, ఆయాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేసే నైట్ వాచ్‌మన్‌లు తదితరులపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. 16 నుంచి 24 వరకు డీఆర్డీఏ క్లస్టర్ కో ఆర్డినేటర్, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో నిరక్ష్యరాస్యుల సర్వేచేపడుతున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్, గ్రామీణ వార్డు సచివాలయం సిబ్బంది, సమన్వయ సహకారంతో పని చేయాలన్నారు. ఈశిక్షణా తరగతులు పూర్తి చేసుకున్న వారికి వచ్చేఏడాది మార్చిలో అసెస్మెంట్ టెస్ట్ నిర్వహించి అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలు సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ ఎం.వి. సుబ్బారెడ్డి, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, డీఈఓ అనురాధ, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి సుబ్రమణ్యం, ఐసీడీసీ, పంచాయితీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శెట్టిగుంట రాజు.. రాణి !

● కొయ్య బొమ్మల తయారీలో మహిళలకు ఉపాధి ● లేపాక్షి ద్వారా విక్రయాలు, పెరిగిన డిమాండ్



రాజురాణి బొమ్మలను తయారు చేస్తున్న కళాకారులు

అనాదిగా బొమ్మల కొలువుల్లో కొలువుదీరిన రాజు.. రాణి బొమ్మలకు లక్ష్మీపురం గ్రామం పుట్టినిల్లుగా మారింది. ఇక్కడి కళాకారుల చేతుల్లో ప్రాణం పోసుకున్న బొమ్మలు గతంలో ఆటబొమ్మలుగా చిన్నారులను అధికంగా ఆకట్టుకునేవి. ప్రస్తుతం దుస్తులు, పూసలు, చెమికీలు, రంగులతో సరికొత్త హంగులు దిద్దుకుని పిల్లలు, పెద్దలు సహా విదేశీయులను సైతం విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

రైల్వేకోడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట పంచాయతీ పరిధిలో ఉన్న లక్ష్మీగారిపల్లెలో తయారు చేస్తున్న రాజు రాణి బొమ్మలు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. వందేళ్లుగా ఇక్కడ కొన్ని కుటుంబాలు బొమ్మల తయారీతో జీవనోపాధి పొందుతున్నాయి. ప్రస్తుతం గ్రామంలో 150 కుటుంబాల్లో 100 కుటుంబాలు రాజురాణి కొయ్య బొమ్మల తయా రీపైనే ఆధారపడి జీవిస్తున్నారు. పురుషులతో పాటు మహిళలు కూడా 6 ఇంచుల నుంచి 36 ఇంచుల ఎత్తు తో బొమ్మలను తయారు చేస్తారు.

ఐదేళ్ల కిందట ప్రారంభం

ఐదేళ్ల కిందట విజయవాడకు చెందిన హస్తకళ అభివృద్ధి సంస్థ వారు లక్ష్మీగారిపల్లెలో రాజురాణి బొమ్మల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో పెద్ద, పెద్ద కొయ్యలను కోసేందుకు యంత్రాలు అమర్చారు. బొమ్మల తయారీకి వీలుగా అన్ని వసతులు కల్పించారు. గతంలో బొమ్మల తయారీకి ఎర్రచందనం వినియోగించేవారు. రానురాను ఎర్రచందనం విలువ పెరిగిపోవడం, అటవీశాఖ సహకరించకపోవడంతో ప్రస్తుతం టేకు, మద్ది తదితర కొయ్యలతో బొమ్మలను తయారు చేస్తున్నారు. ఒక్కో వ్యక్తి ఆరు ఇంచుల ఎత్తు బొమ్మలు రోజుకు 5 జతలు తయారు చేయగలుగుతాడు. 15 ఇంచుల బొమ్మ అయితే ఒక జత, 10 ఇంచుల బొమ్మ అయితే 2 జతలు తయారు చేస్తారు. 6 ఇంచుల రాజురాణి బొమ్మ రూ.230, 10 ఇంచి పొడవు బొమ్మ రూ.330కి విక్రయిస్తున్నారు.

మహిళలకు శిక్షణ

హస్తకళ అభివృద్ధి సంస్థ కేంద్రంలో రెండు నెలలుగా సుమారు 15 మంది మహిళలకు రాజురాణి బొమ్మలకు దుస్తుల అలంకరణపై శిక్షణ ఇస్తున్నారు. ఇందు కోసం 30 ఏళ్ల అనుభవం కలిగిన రైల్వేకోడూరుకు శ్రీదేవిని శిక్షకురాలిగా నియమించారు. దుస్తులతో అలంకరించిన బొమ్మలను మధురై, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, తిరుపతి, తిరుమల ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. బొమ్మలను మరింతగా మార్కెట్ కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం రైల్వేకోడూరులో స్టాల్ ఏర్పాటు చేయాలని, అటవీ శాఖ వారు బొమ్మల తయారీకి అవసరమై ఎర్రచందనం కలపను అందుబాటులో ఉంచాలని కళాకారులు కోరుతున్నారు.



దుస్తుల అలంకరణపై శిక్షణ ఇస్తున్న శ్రీదేవి





దుస్తుల అలంకరణలో రాజు.. రాణి - దేవుని బొమ్మలు



పెరిగిన డిమాండ్

దుస్తుల అలంకరణతో రాజురాణి బొమ్మలకు ఆదరణ పెరిగింది. మరి న్ని స్టాల్స్ ఏర్పాటు చేస్తే విదేశాలకు కూడా ఎగుమతి చేయవచ్చు. రైల్వేకోడూరులో స్టాల్ ఏర్పాటు చేయాలి. ఎంపిక చేటజూ దుస్తులకు డిజైన్ చేసి బొమ్మలకు అలంకరిస్తున్నాం. మహిళలకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి మార్కెట్‌లోకి పంపిస్తున్నాము.

- శ్రీదేవి, శిక్షకురాలు, రైల్వేకోడూరు



స్టాలు ఏర్పాటు చేయాలి

లక్ష్మీగారిపల్లె ప్రధాన దారి వద్ద ప్రభుత్వం రాజు రాణి బొమ్మల స్టాలును ఏర్పాటు చేయాలి. దీంతో మహారాష్ట్ర, హైదరాబాద్, కర్నూలు, కడప, రాజంపేట తదితర ప్రాంతాలనుంచి తిరుమల, తిరుపతి దేవస్థానానికి వెళ్లేవారు బొమ్మలను చూసే అవకాశం కలుగుతుంది. దీంతో వ్యాపారం పెరుగుతుంది.

-వసంత, కళాకారిణి, లక్ష్మీగారిపల్లె





వివిధ రకాల బొమ్మలకు దుస్తుల అలంకరణ

బొమ్మలు దేశవిదేశాలకు వెళ్లాలి

లక్ష్మీగారిపల్లె రాజురాణి బొమ్మలు దేశవిదేశాలకు వెళ్లాలి. ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ బొమ్మలకు మంచి డిమాండ్ ఉంది. కళాకారులకు తగిన పనిముట్లు ఇచ్చినా కొయ్య కొరత వేధిస్తోంది. బొమ్మల తయారీకి ప్రభుత్వం సహకారం అందించాలి

- బత్యాల మధురిమ, కళాకారిణి, లక్ష్మీగారిపల్లె



అధికారులు అడ్డుకుంటున్నారు

బొమ్మలను అమ్మేందుకు వెళుతుంటే అధికారులు పట్టుకుంటున్నారు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. మార్కెటింగ్ కల్పిస్తామన్న నేతలు పత్తా లేకుండా పోయారు. అధికారులు ఇచ్చిన గుర్తింపు కార్డులు చూపించినపుడు మాత్రం బొమ్మలు ఇచ్చేసి పొమ్మంటున్నారు.

- వెంకటసుబ్బయ్య, కళాకారుడు, లక్ష్మీగారిపల్లె



నన్నారి, పొగాకు సాగుపై రైతన్నల దృష్టి



ఓబుళాపురం వద్ద సాగులోఉన్న నన్నారి తోట

కాశినాయన, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలం విభిన్న పంటలకు నిలయమైంది. పంటమార్పిడి, నికర ఆదాయం లభించేలా గతానికి భిన్నంగా కొత్త పంటల సాగుకు రైతులు ముందుకొస్తున్నారు. ఇప్పటికే పండ్ల తోటలకు పేరుగాంచిన కాశినాయన ఇతర పంటల సాగులోనూ అంతే ప్రత్యేకతను చాటుకుంటోంది. ప్రస్తుతం తెగుళ్ళ అడవి పందుల బెడదను తట్టుకునేలా నన్నారి, పొగాకు సాగుకు రైతులు ముందుకొస్తున్నారు. సంప్రదాయ వాణిజ్య పంటలైన ఎండు మిరప, పత్తి, కంది లాంటి సాగు క్రమేపీ తగ్గుముఖం పట్టింది. ఇప్పటికే బసనపల్లె, ఓబుళాపురం, ఉప్పలూరు, వరికుంట్ల పాలగిరి తదితర ప్రాంతల్లో నన్నారి దాదాపు 30 ఎకరాలు సాగులో ఉంది. ఈపంట మొక్కలు నాటిన మూడేళ్లకు గాని నన్నారి గడ్డలు తయారుకావు. గతంలో వీటికి డిమాండ్ ఉండేది. రెడ్డికొట్టాల టీడీపీ నేత ఓ.రమణారెడ్డి 2 ఎకరాలు నన్నారి సాగుచేసి దాదాపు రూ.25 లక్షలు సంపాదించాడు. ఈ ఏడాది కొత్తగా పొగాకు సాగుపై రైతులు. దృష్టి సారించారు. జీపీఐ, ఐటీసీ లాంటి కంపెనీలు ముందుకొచ్చి క్వింటా రూ.15000 చొప్పున పొగాకు కొనుగోలు చేస్తామని రైతులతో ఒప్పందం చేసుకుని పొగనారు నాటిస్తున్నారు. ఉప్పలూరు, ఇటుకులపాడు, పాపిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లోని రేగడి పొలాల్లో పొగాకు విస్తారంగా సాగుచేస్తున్నారు. పిట్టిగుంట, ఓబుళాపురం, చెన్నారెడ్డిపల్లె తదితర గ్రామాల్లోని రోడ్డు సైడు పొలాల్లో నారుమడులు సాగుచేయించి గట్టానారు(5వేలమొక్క) రూ.3500 ప్రకారం రైతులకు అమ్మిస్తూ మండలమేకాక చుట్టుపక్కల మండలాల్లో కూడా పెద్దఎత్తున పొగనారు సాగుచేయిస్తున్నారు.



ఉప్పలూరులో నాటిన పొగనారు

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీకళాశాల విద్యార్థిని శ్రీలత ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు మదనపల్లె వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. దుబ్బిగానిపల్లె వాసులు గురుమూర్తి, ప్రమీల కుమార్తె శ్రీలత కళాశాలకు వచ్చి బాత్‌రూమ్‌లోని యాసిడ్ తాగిందన్నారు. యాసిడ్ ఘాటుకు తట్టుకోలేక విద్యార్థి కేకలు వేయడంతో కళాశాల సిబ్బంది వన్ టౌన్ పోలీసులకు సమచారం అందించారు. అపస్మారక స్థితిలో పడిఉన్న విద్యార్థినిని వెంటనే సర్వజన బోధనాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా యువతి తండ్రి గురుమూర్తి పదేళ్ల కిందట చనిపోవడంతో తల్లి ప్రమీల సంరక్షణలోనే ఉంది. తల్లి వ్యవసాయ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇంటివద్ద భోజనం చేసి కళాశాలకు వెళ్లిన బిడ్డ కళాశాలలో ఏమి జరిగిందో ఏమో తెలియదుగాని ఆత్మహత్యకు యత్నించిందని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బిడ్డను చూసి తల్లి, బంధువులు బోరున విలపించారు. కళాశాల కరస్పాండెంట్ అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది మాత్రం ఆస్పత్రి వద్దకు వచ్చారు. ఏమి జరిగిందో, ఎలా జరిగిందో అయోమయ పరిస్థితిలో తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒక బెడ్ - ముగ్గురు రోగులు

● ఫార్మసీలో సిబ్బంది కొరత ● సమయానికి రాని డాక్టర్లు
● జిల్లా కేంద్రంలో కనిపించని వంద పడకలు ● ఇదీ వందపడకల ఆస్పత్రి తీరు



ఒకే బెడ్‌పై ముగ్గురు పడుకుని ఉన్న దృశ్యం

రాయచోటి(కలెక్టరేట్)అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో వంద పడకల ఆస్పత్రి ప్రారంభమై దాదాపు ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు రోగులను బెడ్లు, ఫార్మసీలో సిబ్బంది కొరత వేధిస్తోంది. పదేళ్లుగా ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న వంద పడకల ఆస్పత్రి నేటికీ పూర్తి స్థాయిలో సేవలు అందించడానికి సిద్ధంగా లేదు. అరకొర సమస్యలున్నాయనే వాదన బలంగా వినపడుతోంది. ఈ ప్రాంతంలో ఏదైనా ఒక చిన్న ప్రమాదం జరిగినా వెంటనే తిరుపతికి, కడపకు రెఫర్ చేసే రోజుల నుంచి అన్నిరకాల సదుపాయాలతో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు వరకు వెళ్లినా అరకొర సౌకర్యాలతో కొట్టుమిట్టాడుతోంది. వివరాల్లోకెళితే....

రాయచోటిని జిల్లా కేంద్రం చేశాక వైసీపీ ప్రభుత్వం పలు జిల్లా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా దాదాపు రూ. 24 కోట్లతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం అయితే చేశారే కాని ఆస్పత్రులపై వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు చూడడంతో అరకొర సౌకర్యాల నడుమ ఆస్పత్రి నిర్వహణ కొనసాగుతోంది. ఈ ఆస్పత్రిలో అన్ని రకాల జబ్బులకు సంబంధించిన డాక్టర్లను పూర్తి స్థాయిలో నియమించినా కొందరు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. వంద పడకల ఆస్పత్రిలో కేవలం 60 బెడ్‌లకు మాత్రమే అధికారులు చర్యలు తీసుకున్నారు. మిగిలిన వాటిపై ఇప్పటి వరకు ఏ రకమైన చర్యలు తీసుకోక పోవడం పలు రకాల విమర్శ లకు తావిస్తోంది. ఫలితంగా రోగులు ఒకే బెడ్‌పై ముగ్గురు ఉండి చికిత్స పొందాల్సిన పరిస్థితి తయారైంది. ఫార్మసీలో కూడా కేవలం ఒకే ఫార్మసిస్ట్ ఉండి రోజూ దాదాపు 1000 మందికి మందులు ఇవ్వడానికి చాలా ఇబ్బందికరంగా ఉందని తెలిసింది. రోజూ దాదాపు 1200 మందికిపైగా ఓపీ జరుగుతున్న ఈ ఆస్పత్రిలో తాగునీటి కోసం దాదాపు రూ.15 లక్షలతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.



మందులు అందిస్తున్న ఫార్మసిస్ట్





డాక్టర్ కోసం వేచి ఉన్న రోగులు - ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ

ఆస్పత్రిలో సమస్యలు

వంద పడకల ఆస్పత్రిలో కొన్ని రకాల మందుల కొరత ఉందని తెలిసింది. ల్యాబ్‌లో సిబ్బంది కొరత ఉంది. ఫార్మసీలో ముగ్గురికి గాను ఒకరే ఉన్నారు. ఆపరేషన్‌కు కావాల్సిన కిట్లు ఇంకా కొన్ని రావాల్సి ఉంది. రోగులకు బెడ్స్ పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ లాంటి జ్వరాలకు సంబంధించిన కిట్లు అందుబాటులో లేవు. సీబీపీ బ్లడ్ టెస్ట్ చేయడానికి సరిపడా పరికరాలు అందుబాటులో లేవు. వంద పడకల ఆస్పత్రిలో వెంటిలేటర్స్ కూడా లేవు. గర్భిణులు ఆపరేషన్ కొరకు ఇంకా కొన్ని మందులు రావాల్సి ఉంది. చిన్నపిల్లలకు కూడా కొన్ని మందులు అందుబాటులో లేక బయట నుంచి తెప్పించుకుంటున్నారని తెలిసింది.

సిబ్బంది, బెడ్ల కొరత వాస్తవమే

ఈ ఆస్పత్రిలో కొంత సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. అంతేగాకుండా బెడ్స్ కూడా కొంత ఇబ్బందిగానే ఉన్నాయి. ఈ విషయంపై అధికారులకు మేము ఇదివరకే రాసి పంపిచాము. వారం, పది రోజుల్లో మరో 20 బెడ్లు ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. దాదాపు రూ.15 లక్షలతో కొత్త ఆర్ఓ ప్లాంట్‌ను వారం రోజుల్లో ప్రారంభం చేయబోతున్నాం. డయాలసిస్‌కి పూర్తి ఏర్పాటు చేశాం. త్వరలో అందుబాటులోకి తీసుకొస్తున్నాం.

ఆస్పత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్

గండికోట అనుబంధ రిజర్వాయర్లకు నీళ్లు నిలిపివేత

కొండాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి దాని అనుబంధ రిజర్వాయర్లకు ప్రస్తుతం నీటిని నిలుపుదల చేసినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. మైలవరం జలాశయం, సీబీఆర్, పైడిపాలెం, వామికొండ, సర్వరాయసాగర్ రిజర్వాయర్లకు ప్రస్తుతం నీటిని నిలుపుదల చేశారు. ఈ రిజర్వా యర్లలో తగినంత నీటిమట్టం ఉండటంతో గండికోటప్రాజెక్టు నుంచి నీటిని నిలుపుదల చేశారు. అదేవిధంగా జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా మంగళవారం గండికోటప్రాజెక్టులోకి 1900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు డీఈ తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.2 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

దెబ్బతిన్న పంటల పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలుగారి పల్లెలో అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు, మండల వ్యవసాయాధికారి సాయిజ్యోతి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో వరి పొలాల్లో నీరు నిల్వకుండా తొలగించి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాన తాకిడికి నేలకొరిగిన కుదుళ్లను నిలబెట్టి గుంపులుగా కట్టి గింజ మొలకెత్తకుండా, రంగు మారకుండా లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి పిచికారి చేయాలన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది సురేఖ, రైతులు పాల్గొన్నారు.

రాయలసీమ యూనివర్శిటీ రిజిస్ట్రారుగా డాక్టర్ విజయకుమార్‌నాయుడు



కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వైవీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెటీరియల్ సైన్స్ అండ్ నానో సహాఆచార్యులు డాక్టర్ బోయ విజయకుమార్‌నాయుడు రాయలసీమ యూనివర్శిటీ రిజిస్ట్రారుగా నియమితులయ్యారు. ఈయన యూనివర్శిటీలో శాఖాధిపతిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, రాష్ట్రీయ ఉచ్చరత్ శిక్ష అభియాన్ సమన్వయ కర్తగా, ట్రాన్స్‌పోర్టు విభాగం సమన్వయకర్తగా వైవీయూ ప్రవేశాల సహాయసంచాలకులుగా, నాక్ కోర్ కమిటీ సభ్యులుగా పనిచేశారు. కాగా, విజయకుమార్‌నాయుడు నియామకం పట్ల వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్టారెడ్డి, ప్రిన్సిపల్ రఘునాదరెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ పద్మ, అధ్యాపకులు అభినందించారు.

ఇంటికి చేరిన నాగేంద్ర మృతదేహం



సికెదిన్నె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గలపల్లె పంచాయతీ బుగ్గలేటి గ్రామానికి చెందిన ఉప్పు నాగేంద్ర (42) మృతదేహం ఎట్టకేలకు ఇంటికి చేరింది. కనీసం చివరి చూపునకు కూడా నోచుకుంటామో లేదోనని ఎదురు చూసిన కుటుంబం సభ్యులు 45 రోజుల తర్వాత మంగళవారం మృతదేహం రావడంతో అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలిలా.. నాగేంద్ర జీవనోపాధి కోసం కువైత్‌కు వెళ్లి అక్కడ కూలి పనులు చేసుకుంటూ వచ్చిన సంపాదనతో కుటుంబాన్ని పోషించేవాడు. అయితే ఆగస్టు 30వ తేదీ నాగేంద్ర అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అతని మరణవార్త కుటుంబ సభ్యులకు తెలుపలేదు. అక్కడ పనిచేసే వారు సమాచారం ఇవ్వడంతో విషయం నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో లోకేష్ చొరవ చూపి మృతదేహాన్ని రప్పించేందుకు ప్రయత్నాలు చేశారు. దీంతో వారి కుటుంబ సభ్యులు మృతదేహం వస్తుందని ఎదురుచూశారు. అంతలోనే నాగేంద్ర అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడని.. అక్కడి చట్టాల ప్రకారం నిబంధనలు పూర్తి చేసిన తర్వాతే మృతదేహాన్ని అప్పగిస్తామని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు విషయాన్ని కమలాపురం శాసనసభ్యుడు పుత్తా చైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన వారు కలెక్టర్, ఎస్పీలకు విషయం తెలిపారు. దీంతో కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాగేంద్ర మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు విశేష కృషి చేశారు. దీంతో కువైట్ నుంచి నాగేంద్ర మృతదేహం ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు మధ్య మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు సహకరించిన మంత్రి లోకేష్‌కు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డికి, కలెక్టర్, ఎస్పీలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నట్లు, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని వారి బంధువులు కోరుతున్నారు.

వీరాంజనేయులు మృతదేహం స్వగ్రామానికి..

రాయచోటిటౌన్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ దేశమైన కువెత్‌కువెళ్లి అక్కడ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కంపా వీరాంజేయులు మృతదేహాన్ని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు చొరవతో ఇండియాకు తరలించారు. సుండుపల్లె మండలం గడ్డమీదపల్లె గ్రామ నివాసి కంపా వీరాంజనేయులు కువైత్‌లో అనుమానాస్పదంగా మృతి చెందాడని.. మృతుడి కుటుంబీకులు జిల్లా ఎస్పీని కలిసి మృతదేహాన్ని స్వదేశానికి రప్పించాలని విన్నవించుకున్నారు. తక్షణమే స్పందించిన ఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడి వీరాంజనేయులు మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించారు. మృతదేహం వెంట కువైట్‌లో ఉన్న మృతుని భార్య చెన్నకేశవులమ్మ స్వగ్రామం చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి దహన సంస్కారాలు పూర్తి చేశారు. వీరాంజనేయులు మృతదేహాన్ని ఇండియాకు రప్పించినందుకు జిల్లా ఎస్పీకి, జిల్లా పోలీసుశాఖకు ఎప్పటికి రుణపడి ఉంటామని కుటుంబ సభ్యులు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకొని కృతజ్ఞతలు తెలియజేశారు.

బలపనూరులో దళితుడిపై దాడి.. కేసు


చికిత్స పొందుతున్న భార్గవ్

సింహాద్రిపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరులో ముమ్మే భార్గవ్ అనే దళిత వ్యక్తిపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తులసీనాగప్రసాద్ తెలిపారు. భార్గవ్‌కు అదే గ్రామానికి చెందిన గజ్జల చంద్రశేఖర్‌రెడ్డిల మధ్య ఆర్థిక లావాదేవీల విషయమై సమస్య తలెత్తింది. దీంతో వారిద్దరి మధ్య గొడవకు దారితీయడంతో చంద్రశేఖ ర్‌రెడ్డి మరో నలుగురు వ్యక్తులతో కలిసి దాడి చేసి.. కులం పేరుతో దూషించినట్లు భార్గవ్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గాయపడిన వ్యక్తిని పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించినట్లు తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయం కూల్చేందుకు కుట్ర

- రిగ్గులతో పేల్చేందుకు ఆలయం చుట్టూ రంధ్రాలు
- పేలకపోవడంతో సమ్మెటలతో కొట్టడంతో ఒరిగిపోయిన ఆలయం
- ములకలచెరువులో దుండగుల దుశ్చర్య


ఒరిగిపోయిన అభయాంజనేయస్వామి ఆలయం

ములకలచెరువు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువు సమీపంలోని కనుగొండ అటవీ ప్రాంతంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం పేల్చి వేసేందుకు దుండగులు యత్నించారు. ఆలయం చుట్టూ పలుచోట్ల రంధ్రాలు పెట్టి రిగ్గుల(పేలుడు పదార్థాలు)తో పేల్చి వేసేందుకు కుట్ర పన్నారు. తుఫాను కారణంగా కురుస్తున్న వర్షానికి రిగ్గులు పేలకపోవడంతో సమ్మెటలతో కొట్టడంతో ఆలయం గోడలు పూర్తిగా దెబ్బతిని భారీగా బీటలు వారాయి. ఒకవైపు ఆలయం ఒరిగిపోయింది. ఏ క్షణమైనా ఆలయం కూలిపోయే అవకాశం ఉంది. దుండగులు ఎందుకు ఆ దుశ్చర్యకు పాల్పడ్డారో అంతుచిక్కడం లేదు. ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు...

ములకలచెరువు మండలం కదిరినాధునికోట పంచాయతీలోని కనుగొండ అటవీ ప్రాంతంలో 16వ శతాబ్దంలో విజయనగర రాజులు నిర్మించిన కనుగొండరాయస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయానికి కొంత దూరంలో విజయనగరరాజుల హయాంలో అభయాంజనేయస్వామి విగ్రహాన్ని బండపై చెక్కించి పూజలు నిర్వహించేవారు. గతంలో ఇక్కడ గుప్తనిధుల కోసం దుండగులు తవ్వకాలు చేశారు. ఒకసారైతే ఆంజనేయస్వామి కళ్లకు గంతలు కట్టి తవ్వకాలు చేపట్టారు. విజయనగర రాజుల కాలం నుంచి ఇప్పటి వరకు ఆంజనేయస్వామికి నిత్య పూజలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ములకలచెరువుకు చెందిన విద్యాసాగర్ అనే వ్యక్తి అభయాంజనేయ సామి ప్రతిమ ఉన్న బండపై 12 ఏళ్ల క్రితం ఆలయం నిర్మించారు. ఇక్కడ ప్రతి శనివారం స్వామివారికి అభిషేకం, అర్చనలు, ఆకు పూజ తదితర కార్యక్రమాలను విద్యాసాగర్ చేస్తున్నారు. ప్రతిఏటా వైకుంఠ ఏకాదశి, శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులు కూడా పెద్ద సంఖ్యలో ఆలయానికి వస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఎందుకో ఏమోగానీ ఈ ఆలయాన్ని కూల్చి వేసేందుకు దుండగులు ప్రయత్నించారు. ఆలయం చుట్టూ నాలుగు చోట్ల రంధ్రాలు పెట్టారు. అందులో రిగ్గులు పెట్టి పేల్చేందుకు యత్నించారు. ఆలయం గోడకు పెట్టిన ఓ రంధ్రం వద్ద కాలిన ఆనవాళ్లు ఉన్నాయి. వర్షానికో ఏమో గానీ రిగ్గులు పేలినట్లు లేదు. ఇంతటితో ఆగకుండా ఆలయాన్ని కూల్చేందుకు సమ్మెటలతో కొట్టారు. సమ్మెటతో కొట్టిన ఆనవాళ్లు ఉన్నాయి. సమ్మెటలతో బలంగా కొట్టడంతో ఆలయం గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆలయం గోడలు ఓవైపు పడిపోయాయి. ఆలయం లోపల కొంత సపోర్టుతో ఆలయం నేలమట్టం కాకుండా ఉంది. అయితే ఏ క్షణమైనా ఆలయం నేలమట్టం అయ్యే అవకాశాలు ఉన్నాయి. దుండగులు ఎందుకు ఇంతటి దారుణానికి పాల్పడ్డారో అర్థం కావడం లేదు. సంఘటన స్థలాన్ని సీఐ రాజారమేశ్, పోలీసులు పరిశీలించారు. ఘటనపై పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.


ఆలయం లోపల ఆంజనేయస్వామి విగ్రహం

గుప్త నిధుల కోసమేనా...?

కనుగొండ అటవీ ప్రాంతంలోని అభయాంజనేయస్వామి ఆలయాన్ని కూల్చివేయడానికి గల కారణాలు అంతుపట్టడం లేదు. దుండగులు గుప్త నిధుల కోసం ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గుప్త నిధుల కోసం వచ్చి ఉంటే ఎక్కడా తవ్వకాలు జరపలేదని చెబుతున్నారు. లేదంటే ఆలయ పూజారిపై కోపంతో ఇంతటి దారుణానికి పాల్పడి ఉంటారేమోనని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పూజారిపై కోపం ఉంటే దేవుడి గుడిని ఎందుకు నేలమట్టం చేస్తారని కొందరు అంటున్నారు. ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయె తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా ఆలయం నేలమట్టం చేసిందెవరో... ఎందుకు చేశారో పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

దుండగులను కఠినంగా శిక్షించాలి

కనుగొండ అడవిలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం పేల్చి వేసేందుకు యత్నించిన దుండగులను కఠినంగా శిక్షించాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పోలీసులను కోరారు. నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టకుండా కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఇంతటి దారుణానికి పాల్పడడం తీవ్ర బాధాకరమన్నారు. ఈ విషయాన్ని తమ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని తెలిపారు.


రిగ్గులు పెట్టి పేల్చేందుకు రంధ్రాలు పెట్టి అగ్గి పెట్టడంతో కాలిన గుర్తులు

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ.. తప్పిన ప్రమాదం

- తరచూ ఇక్కడ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో ప్రజలు


ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ.. గుమికూడిన జనం

ముద్దనూరు అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే గేట్ల వద్ద మంగళవారం ఆర్టీపీపీ రోడ్డులోని ఓ ఇంటిలోకి లారీ దూసుకెళ్లి బీభత్సం సృష్టించింది. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పింది. కాగా, ఐదు నెలల క్రితం ఇదే రోడ్డులోని రైల్వే గేట్లను ఢీకొంటూ మసీదు వద్ద నున్న విజయలక్ష్మి ఇంటిలోకి సిమెంటు లోడు లారీ దూసుకెళ్లిడంతో భారీ ఆస్తి నష్టం సంభవించింది. అది మరవక ముందే మరో లారీ ఇంటిలోకి దూసుకెళ్లిన ఘటన జరగడంతో ఈ ప్రాంతవాసులు భయాందోళన చెందుతున్నారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలు... జమ్మలమడుగు వైపు నుంచి నల్లకార్బన్‌లోడును తీసుకువస్తున్న లారీ అతివేగంగా రావడంతో వంకపై నున్న బ్రిడ్జిని రాసుకుంటూ ఓ ఇంటి ముందు ఉన్న ఇనుప స్టాండ్‌లను, మూడు కరెంట్ స్తంభాలను, ఆటో, కారును ఢీకొంటూ మస్తాన్ అనే వ్యక్తి ఇంటిలోకి దూసుకెళ్లింది. అయితే ఇంటి ముందు మస్తాన్ చిల్లర దుకాణం, టిఫిన్ సెంటర్ నడుపుకుంటున్నాడు. ప్రతి రోజు టిఫిన్ సెంటర్ వద్ద చాలా మంది ఉండేవారు. అంగన్ తెరవకపోవడంతో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దుకాణం ముందున్న రేకుల షెడ్డు, ఆటో నుజ్జు నుజ్జు అయ్యింది. కారు పాక్షికంగా దెబ్బతింది. ఇంట్లో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. లారీ గేట్ల వైపు వచ్చి ఉంటే భారీగా ప్రాణనష్టం జరిగి ఉండేది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. కాగా, గత నాలుగేళ్ల నుంచి ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారే లేరు. బైపాస్ రోడ్డు లేకపోవడం, నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగా భారీ వాహనాలు పట్టణంలోకి ప్రవేశించి ఇక్కడ ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ


సానిపాయి సచివాలయంలో విచారణ చేపడుతున్న డీఎల్‌పీవో

వీరబల్లి, అక్టోబరు 15: పోలీస్ బందోబస్తు నడుమ సానిపాయి పంచాయతీ నిధుల దుర్వినియోగంపై మంగళవారం డీఎల్‌పీవో మస్తాన్‌వలి విచారణ చేపట్టారు. పంచాయతీలో సర్పంచ్ పనులు చేయకుండా నిధులు స్వాహా చేశారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డీపీవోను విచారణకు ఆదేశించారు. వారి ఆదేశానుసారం విచారణకు డీఎల్‌పీవోను పంపారు. గొడవలు జరిగే అవకాశం ఉన్నందున ముందస్తుగా రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్, ప్రత్యేక బలగాలతో సానిపాయి సచివాలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం డీఎల్‌పీవో మస్తాన్‌వలి ఫిర్యాదు దారుడైన నేతి రమేశ్‌ను, సర్పంచ్ నేతి ఆంజేఏయుల సమక్షంలో అభియోగాలపై రికార్డులు తనిఖీ చేసి వారి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. అనంతరం డీఎల్‌పీవో మస్తాన్‌వలి పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఫిర్యాదు దారుడు ఇచ్చిన మేరకు నమోదు చేసుకన్నామని, రికార్డులు, ఆన్‌లైన్‌లో ఉన్న సమాచారం మేరకు విచారించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కాగా, గ్రామంలో పనులు చేయకుండా ఒక్కరూపాయి కూడా డ్రా చేయలేదని సానిపాయి సర్పంచి నేతి ఆంజనేయులు అన్నారు. కొందరు అనవసరంగా లేని పోని నిందలు వేసి బురదచల్లారన్నారు.

వర్షంతో ఆగిన కోతలు

- బొప్పాయి, అరటి రవాణాకు బ్రేక్
- భారీ వర్షంతో జలమయమైన వీధులు


తోటలో మాగి దెబ్బతిన్న బొప్పాయిని చూపుతున్న రైతు

రైల్వేకోడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మంగళవారం రైల్వేకోడూరు నియోజకవర్గంలో బొప్పాయి, అరటి కాయల కోతలను వ్యాపారులు నిలిపివేశారు. కోతలు ఆగిపోవడంతో రైల్వేకోడూరు పట్టణ శివారులోనే లారీలను నిలిపివేశారు. వర్షం దెబ్బకు కాయలు పనికి రాకుండా పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీలకు రెండు రోజులుగా పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు భూమి నానితే ఎక్కువగా అరటి, బొప్పాయి పంటలు నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో బొప్పాయి పంట 20 వేల హెక్టార్లలో ఉండగా, అరటి 20 వేల హెక్టార్లు సాగు లో ఉంది. ఇటీవల అరటి, బొప్పాయి ధరలు బాగా పలికాయి. అరటి కిలో రూ.70 నుంచి రూ.100 వరకు పలికింది. బొప్పాయి టన్ను రూ.15 వేలు పలికింది. ధరలు బాగా ఉన్న సమయంలో వర్షాలు పడడంతో ఒక్కసారిగా కోతలు ఆగిపోవడం, కాయలు తోటల్లో రెండు రోజులకే దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ రెండు పంటలకు మార్కెట్‌లో ప్రస్తుతం మంచి డిమాండు ఉంది. కాగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో రైల్వేకోడూరు పట్టణంలోని పలు వీధులు జలమయం అయ్యాయి. ఇళ్లలోకి నీరు ప్రవేశించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.


కోతలు ఆగిపోయిన అరటి తోట

ఏఎస్ఐ కుటుంబానికి ఆర్థిక సాయం


ఏఎస్ఐ అన్వర్ సతీమణికి చెక్కు అందజేస్తున్న అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు

కడప క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బద్వేలు రూరల్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఏఎస్ఐ ఆర్.అన్వర్ కుటుంబానికి అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు రూ.2.5 లక్షల ఆర్థికసాయం అందించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్ఐ ఆర్.అన్వర్ సతీమణి బీబీజాన్‌కు అదనపు ఎస్పీ చెక్కు అందజేశారు. పోలీసు సంక్షేమంలో భాగంగా ఏర్పాటు చేసిన పోలీసు వితరణ నిధి నుంచి ఈ సాయం అందించారు. కార్యక్రమంలో డీపీఓ ఏవో ఎస్.జ్యోతి, బిసెక్షన్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

పెద్దమండ్యం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలం బండమీదపల్లి గ్రామ పంచాయతీ తురకపల్లిలో మంగళవారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. టీడీపీ యువ నాయకుడు ఇస్మాయిల్(చింటు) అధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్స్ దృష్టి కంటి అసుపత్రి మదనపల్లి వైద్య నిపుణులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 25 మందికి ఉచిత కంటి అపరేషన్‌లకు ఎంపిక చేసినట్లు కంటి వైద్య నిపుణులు డాక్టర్ వంశీధర్‌రెడ్డి తెలిపారు. పెద్దమండ్యం తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్, తంబళ్లపల్లి నియోజకవర్గం జనసేనపార్టీ ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్, సిద్దవరం ఎంపీటీసీ సభ్యుడు రుక్మాంగధరెడ్డి, కంటి వైద్య ఆసుపత్రి మేనేజర్ అభిలాష్, మేకల చలపతి, నాగూర్ మస్తాన్‌వలీ, ప్రభాకరరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ధనాంజనేయులు, వసీం, హమద్‌బాష తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పవిత్రోత్సవాలు

కన్నుల పండువగా స్నపన తిరుమంజనం



వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో పవిత్రాలను ప్రతిష్ఠిస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారి పవిత్రోత్సవాలను అంగరంగ వైభవంగా ప్రారంభించారు. మంగళవారం ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలోని మూల వర్లకు అభిషేకం, అర్చన, తోమాల సేవలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మండప సముదాయంలో వేదపండితులు హోమాధి కార్యక్రమాలు, పూర్ణాహుతి గావించి ఆలయంలో భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులకు అలంకరణలు చేసి విశేష భక్తజనం నడుమ స్నపన తిరుమంజనం వేడుకగా సాగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాల, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టార్, కృష్ణరాజుభట్టార్, భాషికాచార్యులు, ధనుష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలలో నేడు: వాల్మీకిపురం పట్టాభి రాముడి పవిత్రోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం సీతారామలక్ష్మణులకు పవిత్రమాలల సమర్పణ జరగనున్నాయి.

కిలో టమోటా రూ.64



గుర్రంకొండ మార్కెట్ యార్డుకు వచ్చిన టమోటాలు

గుర్రంకొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మార్కెట్ యార్డులో మంగళవారం కిలో టమోటా ధర రూ.64 పలికింది. నెల రోజులుగా టమోటా ధరలు పెరిగాయి. ఈ క్రమంలో కిలో టమోటా ధర రూ.60 నుంచి 90 మధ్య పలుకుతుంది. వారం రోజుల క్రితం కిలో టమోటా ధర రూ.100 ఉండేది. మార్కెట్ యార్డుకు టమోటాలు దిగుబడి పెరగడంతో ధరలు తగ్గాయి. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం కిలో టమోటా ధర రూ.90 ఉండగా, రెండు రోజులుగా రూ.50 నుంచి 60కి చేరింది. బయట రాష్ట్రాల్లో టమోటా దిగుబడి ప్రారంభమైనట్లు వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు టమోటా ఎగుమతి తగ్గడంతో ధరలు తగ్గినట్లు రైతులు, వ్యాపారులు తెలుపుతున్నారు. ఇందులో భాగంగా గుర్రంకొండ మార్కెట్ యార్డులో కిలో టమోటా ధర రూ.64 పలుకగా, 25 కిలోల టమోటా క్రేట్ ధర రూ.1600 పలికింది. టమోటా ధరలు స్థిరంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గొర్రెను దొంగలించిన ముగ్గురు అరెస్ట్

తంబళ్లపల్లె, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గొర్రెను దొంగలించిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. కర్నాటక రాష్ట్రం కోలార్ జిల్లా పాతూరుకు చెందిన తిప్పన్న(44), ఆశ(21), రాజేష్(19)లు సోమవారం ఉదయం కారులో తంబళ్లపల్లె మీదుగా సత్యసాయి జిల్లాలో ఉన్న తిమ్మమ్మమర్రిమానుకు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో తంబళ్లపల్లె మండలం ఆర్ఎన్‌తాండా పంచాయతీ ఎద్దులవారికోట వద్ద రెడ్డమ్మకు చెందిన గొర్రెల మందలో ఉన్న ఓ గొర్రెను చోరీ చేసి కారులో వేసుకుని వెళ్లిపోయారు. గమనించిన స్థానికులు కేకలు వేయగా కారును ఆపకుండా ఉడాయించారు. గొర్రె చోరీపై రెడ్డమ్మ కుటుంబసభ్యులు తంబళ్లపల్లె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ లోకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం ఉదయం గుండ్లపల్లె వద్ద మాటు వేసి కారులో వెళ్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి.. ద్విచక్రవాహనం కాల్చివేత

మదనపల్లె అర్బన్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లె సమీపంలోని గంగోత్రి కళ్యాణ మండపం వద్ద సోమవారం రాత్రి కళ్యాణమంవడపం యాజమాని గంగాధర్‌పై ఇనుపరాడ్లతో దాడి చేశారు. దీంతో అతని కన్ను భాగంలో గాయాలు అయ్యాయి. అలాగే కళ్యాణ మండపం వద్ద ఉన్న అతని ద్విచక్రవాహనాన్ని నిప్పు పెట్టి కాల్చివేశారు. గుర్తు తెలియని దుండగలు 8మంది తనపై దాడి చేశారని బాధితుడు టూటౌన్ పోలీసులకు పిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలి

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి ప్రేమలత నిర్వహించారు. మండలంలోని తుమ్మరకుంట గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని స్థానిక రైతులతో కలసి వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులు, నూతన వంగడాలు, మెలకువలు పాటించాలన్నారు. వివిధ సబ్సిడి పథకాలు, రసాయన ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మదనపల్లె టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విపత్తుశాఖ కొన్ని ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించిన దృష్ట్యా మదనపల్లె డివిజన్‌లోని ప్రజలు 48 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలకు అత్యవసర పరిస్థితులు తెలెత్తితే సబ్‌కలెక్టరేట్‌లో మూడు షిఫ్టులతో పనిచేస్తున్న కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు 9989176247 నెంబర్‌కు, మధ్యాహ్నం 2గంటల నుంచి రాత్రి 10గంటల వరకు 9490827676, నెంబర్‌కు, రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు 6303308475 నెంబర్‌లకు ఫోన్ చేసి అత్యవసర సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను పునారావాస కేంద్రాలకు తరలిస్తారన్నారు. అదే విధంగా రాష్ట్ర, జాతీయ రహదారుల మీద ఉండే కల్వర్టుల వద్ద వాహనదారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి అత్యవరసర సమయంలో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు కలుషితం కాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు పడే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందని, అలాంటి సమయాల్లో సురక్షిత ప్రాంతాల్లోకి వెళ్లాలని సూచించారు. మంగళవారం సాయంత్రం వరకు డివిజన్‌లోని 11 మండలాల్లో 222.2 మీల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. అందులో అత్యధికంగా కురబలకోటలో 27 ఎంఎం, అత్యల్పంగా రామసముద్రంలో 12.2 ఎంఎం వర్షపాతం నమోదైందన్నారు.

తుపాన్ పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : తుపాన్ పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి రమేష్‌నాయక్ సూచించారు. మంగళవారం ఆయన స్థానిక మండల కేంద్రమైన పీటీఎంలో పాడి రైతులకు అవగాహన కల్పించారు. తుపాన్ సమయంలో పాడి రైతులు పశువులను లోతట్టు ప్రాంతాలలో, వృక్షాలు, టవర్లు కింద మేప కూడదన్నారు. పశువులను ఎలక్ట్రికల్ స్తంభాలకు, వేలాడే తీగలకు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర కట్టి వేయరాదన్నారు. పాడి ఆవులను వర్షాలకు తడవకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నిమ్మనపల్లిలో: బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ధనంజేయులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు అతి భారీ వర్షాలు ఉండడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. అలాగే గ్రామాలలోని కుంటలు, చెరువులు, వద్ద సంభందిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాడిరైతులు ఆవులు, గొర్రెలను సురక్షిత ప్రాంతాలను తరలించాలని పశు వైద్యాధికారి సురేష్ తెలిపారు.



పీటీఎంలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల పశువైద్యాధికారి రమేష్‌నాయక్

రామసముద్రంలో: తుఫాను ప్రభావంతో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో భానుప్రసాద్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సెక్రటరీలతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా పంచాయతీలలోని చెరువు కట్టల పటిష్ఠతను పరిశీలించాలని, తాగునీరు క్లోరినేషన్, ట్యాంక్‌క్లీనింగ్, శానిటేషన్ మెటీరియల్ జేసీబీలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే గాలి ప్రభావంతో చెట్లు విరిగి రోడ్డుపై పడడం, విద్యుత్ తీగలు తెగిపడడం వంటి సంఘటనలు జరిగితే వెంటనే యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చెంబకూరు సమీపంలో ఉన్న చెల్లాయ చెరువును పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో కలసి ఎంపీడీవో పరిశీలించారు.

కలికిరిలో: తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాల వల్ల పంచాయతీల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో భానుమూర్తి రావు ఆదేశించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం జరిపిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాగు నీరు కలుషితమయ్యే అవకాశాలున్నాయని, బోర్ల సమీపంలో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి జరగకుండా అవసరమైతే వైద్య సిబ్బంది సహాయంతో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్ డీఈ మధుసూధన్

పీలేరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుఫాను నేపథ్యంలో మండలంలోని అన్ని శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పీలేరు ఎంపీపీ కంభం సతీశ్ రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పీలేరు మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా కల్వర్టులు, చెరువుల తూములు, కట్టలు దెబ్బతింటే వెంటనే సమాచారం అందించాలన్నారు. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా మండలానికి రూ.85 లక్షలు మంజూరు కాగా వాటితో సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నట్లు పంచాయతీరాజ్ డీఈ మధుసూధన్ తెలిపారు. గృహనిర్మాణ శాఖ ఏఈ రమణయ్య మాట్లాడుతూ జగనన్న కాలనీల్లోని గృహాలను వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు వైద్య దోపిడీని అరికట్టండి

మదనపల్లె టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వైద్య దోపిడీని అరికట్టాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు బీవైఎస్ నాయకులు విన్నవించారు. మంగళవారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో మంత్రి సత్యకుమార్‌ను బీవైఎస్ అధ్యక్షుడు పునిత్ కలసి సమస్యలు విన్నవించారు. అనుమతులు లేకున్నా పలు ప్రైవేటు ఆస్పత్రులు, అధిక ఫీజులతో ప్రజలను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా, తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి వెళ్లిపోతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు జిలానిబాషా, నాగరాజు, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి

పీలేరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు అంగవైకల్యం పొందిన ఇంజనీరింగ్ విద్యార్థికి పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ తూగుంటపల్లెకు చెందిన కృష్ణయ్య, భారతీల ఏకైక కుమారుడు దేవేంద్ర(21) ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తమ పొలం వద్ద విద్యుత్ తీగలు తగిలి ప్రమా దానికి గురయ్యాడు. ఈ ఘటనలో అతను రెండు చేతులు, కుడికాలు కోల్పోయాడు. దీంతో అతనికి కృత్రిమ అవయవాలు సమకూర్చుకునేం దుకు తగిన ఆర్థిక స్థోమత లేక ఇబ్బందిపడుతున్నారని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి మంగళవారం వారి ఇంటికి వెళ్లి తన వంతు సాయంగా రూ.లక్ష అందించారు. ఈ కార్యక్రమంలో బాలంవారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి, వెంకటరమణ, పాల్గొన్నారు.

నేటి నుంచి కొత్త మద్యం

మదనపల్లె టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం ప్రియులకు బుధవారం నుంచి పండగే. ఐదేళ్లగా ప్రీమియం బ్రాండ్ల కోసం ఎదురు చూసిన మద్యం ప్రియులకు మేలురకం మద్యం దొరకనుంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీతో ప్రైవేటు దుకాణాలకు లైసెన్సులు ఇచ్చి ప్రీమియం మద్యం బ్రాండ్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇందులో భాగంగా బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త మద్యం దుకాణాలకు సరఫరా కానుంది. జిల్లాలోని ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలోని 111 మద్యం దుకాణాలకు కడప, మదనపల్లె ఐఎంఎల్ డిపోల నుంచి మద్యం సరఫరా చేయనున్నారు. ఇందులో కడప డిపో నుంచి రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు నియోజకవర్గాలలోని 69 మద్యం దుకాణాలకు, మదనపల్లె ఐఎంఎల్ డిపో నుంచి మదనపల్లె, ములకలచెరువు, వాల్మీకిపురం ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలోని 42 మద్యం దుకాణాలకు మద్యం సరఫరా చేయనున్నారు.

కరెంట్ అకౌంట్లు...సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లతో మద్యం సరఫరా

మదనపల్లె ఐఎంఎల్ డిపో నుంచి మద్యం కొనుగోలుకు రిటైలర్లు (లైసెన్సీదారులు) వారి బ్యాంకు కరెంట్ అకౌంట్ల నుంచి ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ ద్వారా వివిధ బ్రాండ్ల కొనుగోలుకు ఇండెంట్‌లు పెడుతున్నారు. కొత్తగా వచ్చిన సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయడంతో పాటు గెజిట్‌లోని నెంబర్ల ఆధారంగా లైసెన్సీ దారులకు పాస్‌వర్డ్‌లు కేటాయిస్తున్నారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు

మదనపల్లె అర్బన్, అక్టోబర్ 15:(ఆంధ్రజ్యోతి) కోర్టులో వెలసిన గంగమ్మకు మంగళవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని పుష్పాలతో అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు రాహుకాల సమయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మకు చీర, జాకెట్లు, పొంగళ్లు నైవేద్యం సమర్పించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రంగస్వామినాయుడు, కరుణా కర్‌నాయుడు, విక్కీ, మహేష్, దేవేంద్ర, శ్రీనివాసులునాయుడు పర్యవేక్షించారు.

గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యులు కీలకం



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో అమర్‌నాథరెడ్డి

తంబళ్లపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):గ్రామాల అభివృద్ధిలో ఉప సర్పంచ్, వార్డు సభ్యుల పాత్ర కీలకమైందని డీఎల్‌డీవో అమర్‌నాథరెడ్డి అన్నారు. మంగళవాం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు మండల స్థాయి రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమంలో డీఎల్‌డీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ విధులు, పరిపాలన, హక్కులు తదితర అంశాలకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. అనంతరం డీఎల్‌డీవో మాట్లాడుతూ..గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. తదనంతరం తంబళ్లపల్లె సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఏవో థామస్ రాజా, ఈవోఆర్డీ దిలీప్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని గ్రామ పంచాయతీ ఉప సర్పంచు, వార్డు సభ్యులకు పెద్దమండ్యం ఎంపీడీవో శ్రీధర్ రావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల గ్రామ పంచాయతీ ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు రిఫ్రెషర్ శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడుతూ గ్రామాల రోడ్లు, తాగునీరు, ఆరోగ్య తదితర సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామ పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రామసముద్రంలో: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లకు, ఎంపిక చేసిన ఇద్దరు వార్డు సభ్యులకు రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో భానుప్రసాద్ మాట్లాడుతూ ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు వారి పంచాయతీలలో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

కలికిరిలో: గ్రామ పంచాయతీ పాలక వర్గాల సమష్టి నిర్ణయాలతోనే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని ఈవోపీఆర్డీ పరశురామ్ స్పష్టం చేశారు. పంచాయతీ ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు పాలనా వ్యవహారాలు, అభివృద్ధి కార్యక్రమాలపై మంగళవారం ప్రారంభమైన రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సర్పంచు ఒక్కరే నిర్ణయాత్మకంగా పనిచేస్తే ప్రజలకు సత్ఫలితాలు అందవని, వార్డు సభ్యులు, ఉప సర్పంచులు నిర్ణయాల్లో క్రియాశీలకంగా భాగస్వామ్యం వహించాలని ఆయన పేర్కొన్నారు. పంచాయతీ సమావేశాలను సక్రమంగా, సకాలంలో నిర్వహించేందుకు సహకరించాలన్నారు. మండలంలోని ఒక్కో పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు సభ్యులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: గ్రామాలలో ప్రజా సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వాల్మీకిపురం ఎంపీడీవో మనోహర్‌రాజు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వార్డు సభ్యులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల ఆస్తుల పరిరక్షణ, కేంద్ర ప్రభుత్వ పథకాలు, గ్రామ పంచాయతీ సొంత ఆదాయ వనరులు, గ్రామ పంచాయతీ నిధులు, బాధ్యతలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం కాకుండా ప్రణాళిక బద్ధంగా గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్‌డీ సుధాకర్‌రెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సినీ నిర్మాత సురేష్ మృతి



మదనపల్లె అర్బన్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో సినీ నిర్మాత బి. సురేష్(చిన్నా) హైదరాబాదులో సోమవారం రాత్రి మృతి చెందాడు. ఆయన మదనపల్లె మండలం, రామాచార్లపల్లెకు చెందిన వాడు. మదన పల్లెలో 1966లో జన్మించాడు, ఇక్కడే స్థానిక కోటబడిలో పదో తరగతి వరకు చదువుకున్నాడు. అనంతరం హైదరాబాదు, మద్రాస్‌లో నివసిస్తూ సినీ నిర్మాతగా ఎదిగాడు. సురేష్ ప్రముఖ సినీ నిర్మాత బెల్లంకొండ సురేష్ వద్ద ప్రొడక్షన్ మేనేజరుగా, అసోసియేట్ గా చాలాకాలం పని చేశారు. ఇతను సినీ హీరో రాజేంద్రప్రసాద్‌కు బావమరిది, సీనియర్ సినీ యాక్టర్ రమాప్రభ చెల్లెలి కుమారుడు 1998లో సినీ నిర్మాతగా మొదట అప్పుల అప్పారావు, జానీ వకల్ మలయాళం చిత్రాని తెలుగులోకి అనువదించి నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు. ఈయన చైన్నై చిన్నాగా పేరుపొందాడు. ఇతనికి భార్య సునీతా, డిగ్రీ చదవుతున్న కుమార్తె సుష్మిత ఉన్నారు. మంగళవారం ఇతని మృతదేహాన్ని మదనపల్లెకు తరలించారు. సురేస్ అంత్యక్రియలు మదనపల్లె మండలం, రామాచార్లపల్లెలో బుధవారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

మదనపల్లెలో ఇరువర్గాల ఘర్షణ

మదనపల్లె అర్బన్, అక్టోబరు15: (ఆంధ్రజ్యోతి)మదనపల్లె పట్టణంలోని మల్లికార్జున సర్కిల్ నందు ద్విచక్రవాహనం కుదువ విషయంగా ఇరువర్గాలు ఘర్షన పడ్డారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నారు. పట్టణానికి చెందిన ఓ యువకుడు బుల్లెట్ వాహనాన్ని తనకు తెలిసిన వ్యక్తి వద్ద కుదువ పెట్టారు. దీని విషయం మద్యం మత్తులో యువకులు వీరంగం చేశారు. స్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారిపై దాడులు చేశారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సరికే కొందరు అక్కడ నుంచి జారుకున్నారు. కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోండి



జడ్పీహైస్కూల్లో అబ్దుల్‌కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దేశానికి అంతరిక్ష పరిశో ధనల్లో ఖ్యాతి తెచ్చిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కాలంను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో అబ్దుల్‌కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టినా చిన్ననాటి నుంచి కష్టపడి పైకి వచ్చిన కలాం ఇస్రోలో శాస్త్రవేత్తగా, చైర్మన్‌గా, రాష్ట్రపతిగా ఉన్నత పదవులు అలంకరించారని గుర్తుచేశారు. నేటి విద్యార్థులు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం వెల్‌విషర్స్ సంస్థ గిరీష్ ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్ర మంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఆర్‌కే రామకృష్ణాచారి, నాగార్జున గాంధీ, నాదెళ్ల శివన్న, షంషీర్, సహదేవనాయుడు, జేసీబీ మధు, ఎస్ఎం రఫి, జీవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు. స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: మండలంలోని బురకాయలకోటలో మంగళవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం సర్కిల్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంటు బీసీ సెల్ అధికార ప్రతినిధి ముత్తుకూరు మౌళా, యూనిట్ ఇచ్‌చార్జి రామకృష్ణమరాజు, నాయకులు రెడ్డిబాషా, నిజాంవలి, మస్తాన్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి పెద్దపీట



ములకలచెరువులో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువులోని వినాయకనగర్‌లో మంగళవారం పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా నాలుగు సీసీ రోడ్లకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలైన సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల పనులు ప్రారంభిస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తంబళ్లపల్లె నియోజకవర్గం అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గ ప్రజలకు మంచి రోజులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏపీడీ మధుబాబు, ఎంపీడీవో హరినారాయణ, పీఆర్ ఏఈ అనిత, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతి నిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, మాజీ ఎంపీపీ సిగి నరసింహులు, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నేతలు మంత్రి గిరిధర్‌రెడ్డి, కట్టా సురేంద్రనాయుడు, కేశవరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మూగి రవిచంద్ర, భాస్కర్‌రెడ్డి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల రీవెరిఫికేషన్ పూర్తిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర

బి.కొత్తకోట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో ఫ్రీహోల్డ్ అయిన భూముల రీవెరిఫికేషన్‌ను వెంటనే పూర్తి చేయాలని హంద్రీ-నీవా స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా వీఆర్వోలతో వివరాలను రాబట్టారు. త్వరిత గతిన రీవెరిఫికేషన్‌ను పూర్తి చేయాలని, రెవెన్యూ రికార్డుల ప్రకారమే పంచనామా, చెక్‌లిస్ట్‌లో వివరాలు పొందుపరచాలని తప్పుడు సమాచారం ఇస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహశీల్దార్ మహహమ్మద్ అన్సారీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత పుట్టిన రోజు వేడుకలు



వాల్మీకిపురం మండలం గండబోయనపల్లెలో కేక్ కట్ చేసి పంచుతున్న నాయకులు

వాల్మీకిపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండల టీడీపీ నేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గండబోయనపల్లె టీడీపీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు పులి సత్యారెడ్డి భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. స్థానిక సత్యమ్మతల్లి ఆలయంలో పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే వాల్మీ కిపురం గాంధీ బస్టాండులో నిరంజన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమాలలో నాయకులు గాంధీపేట రమణ, పీవీ నారాయణ, కోసూరి రమేష్, రాజేంద్రాచారి, బొక్కసం బ్రదర్స్, తుంబూరి రమణ, సయ్యద్, అమీర్, సైదు, గోవిందు, కిట్టు, మధు, గాంధీపేట రెడ్డి, కువైట్ బాబు, యూసుఫ్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

25 రోజుల్లో డైనింగ్‌హాల్ నిర్మాణం పూర్తి చేయాలి

మదనపల్లె టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జడ్పీహైస్కూల్లో డైనింగ్‌హాల్ నిర్మాణాన్ని 25 రోజుల్లో పూర్తి చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పంచాయతీరాజ్ డీఈ, ఏఈలను ఆదేశించారు. మంగళవారం జడ్పీహైస్కూల్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయిన విద్యార్థుల బోజనశాల(డైనింగ్ హాల్) నిర్మాణాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లర్ల వరకు నిర్మించిన ఈ భవనాన్ని ఎందుకు మధ్యలో నిలిపివేశారని కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. దీనిపై పంచాయతీరాజ్ డీఈ శివప్రసాద్, ఏఈ రమణను వివరణ అడిగారు. నిధుల విషయమై జడ్పీ సీఈవోతో చర్చిస్తానని, వెంటనే భవన నిర్మాణ పనులు ప్రారంభించి, పైకప్పు రేకులు వేసి కింద ఫ్లోరింగ్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు మహ్మద్‌ఖాన్, టీడీపీ నాయకులు షంషీర్, సహదేవనాయుడు, నాదెళ్ల శివన్న పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లను వెంటనే అరికట్టాలి



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసనాయుడు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 15:(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అన్‌లైన్ బెట్టింగ్ విపరీతంగా జరుగుతున్నాయని వాటిని వెంటనే అరికట్టాలని మదనపల్లె డివిజన్ మాజీ సైనికోద్యోగుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసనాయుడు కోరారు. ఆమేరకు స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం డీఎస్పీ కొండయ్యనాయుడును కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్, గుర్రపు స్వారీ, పేకాటా, పబ్జీ, తదితర ఆన్‌లైన్ జూదానికి అలవాటుపడి యువత ప్రాణాలను కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు వలన కలిగే నష్టాలను కరపత్రాల ద్వారా తెలియజేయాలని కోరారు.

ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి



కూటమి నేతలతో మాట్లాడుతున్న తంబళ్లపల్లి జనసేనపార్టీ ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్

పెద్దమండ్యం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తంబళ్లపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ పిలుపునిచ్చారు. మండలంలోని తురకపల్లిలో మంగళవారం జనసేనపార్టీ ఆధ్వర్యంలో కూటమి నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం కూటమి నేతలు పని చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికి అందించడానికి కూటమి నేతలు సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వాధికారులు, నేతలు కలసి పథకాల వివరాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికలను సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. అనంతరం బండమీదపల్లి గ్రామ పంచాయతీ గ్రామ సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. కూటమి నేతలు ఇస్మాయిల్, నాగూరి మస్తాన్‌వలి, చలపతి, ప్రభాకరరెడ్డి, ధనాంజనేయులు, ప్రకాష్‌రెడ్డి, వసీం తదితరులు పాల్గొన్నారు.